
సంకల్ప బలం
రు.20/-
ఫిబ్రవరి 2024
ఘనంగా
బాలరాముని
విగ్రహ
ప్రాణప్రతిష్ఠ

పద్మవిభూషణ్ శ్రీ వెంకయ్య నాయుడు








# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

ఫిబ్రవరి 2024

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

సంపుటి -13 సంచిక - 5


## ఈ సంచికలో....


సంపాదకీయం 4

బ్రహ్మ ఖండం 6

అయోధ్య రామమందిరం - కల సాకారం 10

మెరుపుల్లేని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ 22

స్త్రీలోని స్వాభిమానతకు ప్రతీక- దేవయాని 23

ప్రసీద మమ భాస్కరా 29

సతీదేవితో శివుని వివాహం 35

సమతుల్యం 41

డా. సంగనభట్ల నర్సయ్య 46

గళ్ళనుడి కట్టు 49



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

వెంకయ్యనాయుడు, చిరంజీవులకు పద్మ విభూషణ్ - రెండో అత్యున్నత పౌర పురస్కారం ఐదుగురికి రెండో అత్యున్నత పౌర పురస్కారం 17 మందికి పద్మభూషణ్, 110 మందికి పద్మశ్రీ

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి లను రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్' వరించింది. అలాగే కళారంగం నుంచి నృత్య కళాకారిణి, సీనియర్ నటీమణి వైజయంతిమాల బాలి, ప్రముఖ భరత నాట్య కళాకారిణి పద్మా సుబ్రహ్మణ్యంలు ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక అయ్యారు. బీహార్ కు చెందిన సులభ్ శౌచాలయ సృష్టికర్త బిందేశ్వర్ పాఠక్ కు సామాజిక సేవా విభాగంలో మరణానంతరం 'పద్మ విభూషణ్' ను ప్రకటించింది. ఈ ఏడాది వివిధ రంగాలకు చెందిన మొత్తం 132 మందికి కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాలు ప్రకటించింది. కళ, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, శాస్త్ర సాంకేతికం, ఇంజనీరింగ్, వాణిజ్యం, ,పరిశ్రమలు వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, ప్రజా సేవ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పద్మభూషణ్, విశిష్ట సేవలు అందించిన వారికీ పద్మశ్రీ అవార్డులు అందించింది.

రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్, మోదీ ---- రేవంత్ రెడ్డి

భాజపాను నిలువరించడం కాంగ్రెస్ కే సాధ్యం

ప్రధాని మోడీతో కేసీఆర్ చీకట్లో చేస్తున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారు. భారాస కు ఓటేస్తే, మూసీలో వేసినట్లే అని, కేంద్రంలో భాజపాను నిలువరించడం కాంగ్రెస్ కే సాధ్యమని ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే, దేశాన్ని మోడీ అప్పులపాలు చేశారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికలు 60 రోజుల్లో మొదలయ్యే అవకాశాలున్నాయని, ఎంపీ టిక్కెట్లు ఆశించే కాంగ్రెస్ నేతలు ఫిబ్రవరి 3 లోగా పీసీసీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికను పూర్తిగా అధిష్టానం చూసుకుంటుందన్నారు. 'అభ్యర్థుల ఎంపిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ, పీఈసీ తీర్మానం చేసింది. టిక్కెట్లు ఆశించే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులైతే రూ 25000, ఇతరులు రూ 50,000 చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాలి. విభజన చట్టంలోని హామీలను కేంద్రం లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేస్తుంది' అంటూ పీఈసీ సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు.

లోక్ సభ ఎన్నికల బరిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి!

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ... లోక్ సభ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. ఖమ్మం పార్లమెంటు స్థానం నుంచి బరిలోకి దిగాలని ఆమె భావిస్తున్నారు. ఈ మేరకు గాంధీ భవన్ లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి ఆమె హైదరాబాద్ చేరుకున్నారు.

యాదాద్రిలో సౌకర్యాల పై దృష్టి

ప్రఖ్యాత పుణ్య క్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని సౌకర్యాల విషయంలో భక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో, త్వరలో ఆలయాన్ని సందర్శించి, ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజా భవన్ లో వెల్లివిరిసిన మానవత్వం

ప్రజా భవన్ లో యంత్రాంగం వినతులు స్వీకరించడంతో పాటు తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఓ పసికందును వెంటనే చికిత్స చేయించాలని నిర్ణయించి, ప్రభుత్వ అంబులెన్స్ లో ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యశ్రీ కింద చేయాలని ఆదేశించారు. ఈ నిర్ణయంతో, తల్లి సునీతతో పాటు వినతి పత్రాలు సమర్పించడానికి వచ్చిన వారంతా హర్షం వ్యక్తం చేశారు.

నిషాలో కండక్టర్ ను తన్నిన స్త్రీ

హయత్ నగర్ డిపో ఆర్టీసీ బస్సులో ఓ యువతి మద్యం మత్తులో వీరంగం సృష్టించింది. చిల్లర ఇవ్వలేదని కండక్టర్ ను దుర్భాషలాడుతూ, కాలితో ఆర్టీసీ బస్ కండక్టర్ ను తన్ని, తోటి ప్రయాణికులు వారిస్తున్నా అసభ్య పదజాలంతో రెచ్చిపోయింది. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పై ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించమని టిఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు.

హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి సంచలన నిర్ణయం

హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తం 85 మందిని బదిలీ చేసే సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎస్సై నుంచి హోంగార్డుల వరకు అందర్నీ ఒకే సారి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరిని సిటీ ఆర్మ్ డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

లోక్ సభ ఎన్నికల బరిలో కాంగ్రెస్ కసరత్తు

అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిపత్యం లభించని స్థానాలపై కాంగ్రెస్ కసరత్తు

తెలంగాణలో అధికారాన్ని దక్కించుకున్న కాంగ్రెస్, లోక్ సభ ఎన్నికల్లో కూడా తన ఆధిపత్యం చాటాలని ప్రయత్నిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించినా, కొన్ని లోక్ సభ స్థానాల పరిధిలో విపక్ష కూటమి లైన భారాస, భాజపా ల కంటే తక్కువ ఓట్లు లభించాయి. ఉత్తర తెలంగాణలో కొన్ని చోట్ల ఇలాంటి ఫలితాలు వచ్చాయి. ఆధిక్యం లభించని చోట బలమైన అభ్యర్థులను దింపాలని కాంగ్రెస్ ఆలోచిస్తోంది.

రూ 200 కోట్లతో అస్సాంలో మోడీ కాంస్య విగ్రహం

అస్సాం వ్యాపారవేత్త నవీన్ చంద్ర బోరా ప్రధాని మోదీపై తనకున్న అభిమానాన్ని చాటి చెప్పేందుకు రూ 200 కోట్ల సొంత ఖర్చుతో 190 అడుగుల మోదీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గుహవాటి నగరానికి సమీపంలో ఉన్న తన జాగాలో సోమవారం భూమి పూజ ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగనుంది. పీఠభాగం తో కలుపుకుని విగ్రహం ఎత్తు 250 అడుగులు ఉంటుందని నవీన్ చంద్ర తెలిపారు.

### చైనా సైన్యానికి ఎదురొడ్డి నిలబడిన గొర్రెల కాపరులు

వాస్తవాధీన రేఖ వద్ద మన గొర్రెల కాపరులు చైనా సైన్యానికి ఎదురొడ్డి నిలబడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సరిహద్దు ప్రాంతంలో భారత భూభాగం వైపు జీవాలను మేపద్దంటూ పీఎల్ ఏ దళాలు అభ్యంతరాలు తెలిపినా ... వారు లెక్క చేయలేదు. మన సైన్యం సాయంతో అక్కడ నుంచి చైనా సేనలను వెనక్కి పంపించారు. లద్దాఖ్ లోని కాక్ జంగ్ గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంబంధించిన దృశ్యాలను ఛుషుల్ కౌన్సిలర్ కొంచోక్ స్టాంజిన్ షేర్ చేశారు. కొద్ది రోజుల క్రితం కాపరులు, చైనా సైన్యానికి మధ్య వివాదానికి సంబంధించిన వీడియోను కూడా కొంచోక్ షేర్ చేశారు. గొర్రెల కాపరులు ఆ ప్రాంతాన్ని వీడాలని చైనా సైనికులు హారన్ కొట్టి సంకేతాలు ఇస్తే, తాము భారత భూభాగం వైపే ఉన్నామని వాళ్లకు చెప్పారు.

### భారాస సభ్యత్వానికి రాజీనామా చేసిన రాజయ్య

స్టేషన్ ఘన్ పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కారు దిగి, భారాస పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు ఆ లేఖను మీడియాకు చూపించారు. మీడియాతో మాట్లాడుతూ, భారాస లో మానసిక క్షోభకు గురయ్యానని, నాకు పార్టీ లో సరైన గుర్తింపు కూడా లభించలేదని, అధినాయకత్వాన్ని కలిసే అవకాశమే దక్కడం లేదు అని మీడియాతో చెప్పారు. పార్టీ విధి విధానాలు కూడా నచ్చడం లేదని, 15 ఏళ్ళు కాంగ్రెస్ లో ఉండి, తెలంగాణ కోసం పోరాడా .. అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సరి కాదు అన్నారు .

### అభివృద్ధి పేరుతో భారాస ప్రజలను నిర్లక్ష్యం చేసింది -- కిషన్ రెడ్డి

అభివృద్ధి పేరుతో భారాస ప్రభుత్వం పేద ప్రజలను, తప్పుదోవ పట్టించడమే కాక, నిర్లక్ష్యం చేసిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. మాయ మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మాయమాటలు చెప్పకుండా ప్రజలకు సేవ చేయాలని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే బస్తీలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రజలను ఆదుకునేందుకు భాజాపా మాత్రమే అని చెప్పారు.

### కరెంటు కనెక్షన్ కు సెల్ ఫోన్ నంబరు

కరెంటు కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు తమ ఫోన్ నంబరును విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. కరెంటు బిల్లు, తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఫోన్ నంబరుకు సంక్షిప్త సందేశం రూపంలో విద్యుత్ పంపిణీ సంస్థ పంపుతుంది. కొందరు వినియోగదారుల నంబర్లు లేకపోవడంతో సందేశాలు వెళ్లడం లేదని అధికారులు తెలిపారు.

### తెలంగాణ బడ్జెట్ కసరత్తు తుది దశకు --- గ్యారెంటీల అమలుకే ప్రాధాన్యం

శాఖల వారీగా ప్రతిపాదనలపై సమీక్షలు పూర్తి కాగా పద్దు ఖరారు కావాల్సి ఉంది. గ్యారెంటీల అమలుకు బడ్జెట్ లో ప్రాధాన్యత దక్కనుంది . కేంద్రంలో మధ్యంతర బడ్జెట్, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ బడ్జెట్ కసరత్తు తుది దశకు చేరుకుంది.

### ఎల్ . కె . అడ్వాణీ కి భారతరత్న

రాజకీయ కురువృద్ధుడు, భాజపా అగ్రనేత ఎల్ . కె . అడ్వాణీ ని కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' తో గౌరవించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా శనివారం వెల్లడించారు. దేశాభివృద్ధిలో అడ్వాణీ పాత్ర కీలకమని కొనియాడుతూ, అడ్వాణీ ని భారతరత్న పురస్కారంతో గౌరవించనున్నాం అని, ఆయనతో ఫోన్ లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు మోదీ.

### భారత్ లో కలవరపెడుతున్న క్యాన్సర్

భారత్ లో క్యాన్సర్ కేసులు కలవరపెడుతున్నాయి 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా కొత్త కేసులు వెలుగు చూసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడించాయి. ఆ సంవత్సరంలోనే ఈ వ్యాధి కారణంగా 9 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పురుషుల్లో పెదవి, నోరు, ఉపిరితిత్తులు, అన్నవాహిక క్యాన్సర్లు ఎక్కువగా నమోదయ్యాయి. మహిళల విషయంలో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార అండాశయానికి సంబంధించిన క్యాన్సర్లు అధికంగా వెలుగు చూశాయి. ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్ల క్యాన్సర్ కేసులు నమోదు కాగా, 97 లక్షల మరణాలు సంభవించాయి. భారత్ లో 75 ఏళ్ల లోపు వారిలో 10.6 శాతం మంది ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉన్నట్లు తేలింది.

### ప్రతీకార దాడులపై బైడెన్

జోర్డాన్ ఇటీవల అమెరికా సైనిక క్యాంపు పై డ్రోన్ దాడి జరగడంతో ముగ్గురు సైనికులు మృతిచెందారు. దీన్ని అగ్రరాజ్యం తీవ్రంగా పరిగణించింది. డ్రోన్ దాడికి అగ్రరాజ్యం ప్రతీకార దాడులు ప్రారంభించింది. ఇరాక్, సిరియా లోని ఇరాన్ మద్దతు గల మిలిటెంట్లు, ఇరాన్ రివల్యూషనరీ గార్డుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. ఈ దాడులపై తాజాగా స్పందించిన జో బైడెన్ స్పందించారు. తాము ఘర్షణలను చేరుకోవడం లేదని, కానీ అమెరికన్లకు హాని కలిగిస్తే మాత్రం మేం ఖచ్చితంగా ప్రతిస్పందిస్తాం అని, రానున్న రోజుల్లో తమ టార్గెట్లపై మరిన్ని భీకర దాడులు ఉంటాయని హెచ్చరించారు.



ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న కష్టార్జితాన్ని పేదలు కాని వారు కూడా పేదలమంటూ , ప్రభుత్వం ఇచ్చే ఉచితాలను స్వాహా చేస్తుంటే, ఏమీ లేక, ఎవరికీ చెప్పుకోలేని ఎందరో మధ్యతరగతి కుటింబీకులు అల్లాడిపోతున్నారు. అందరికీ న్యాయం జరిగి, ప్రజలంతా సంతోషంగా ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

**సర్వేజనా సుఖినోభవంతు**

**తీగవరపు శాంతి**

# బ్రహ్మఖండం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

5.వ. అధ్యాయం.

ఆలంబన - విధూమల వృత్తాంతం.

"విధూమ" అను వసువు, "ఆలంబన" అను దేవతాస్త్రీ ఉండే వారు. వీరిరువురు బ్రహ్మ శాపం వలన మానవ జన్మ ఎత్తారు. ఆవృత్తాంతం మీకు చెబుతాను శ్రద్ధగా వినండి" అని సూతుడు ఈ విధంగా చెప్పడం ప్రారంభించాడు.

ఒక రోజున బ్రహ్మ బ్రహ్మ లోకంలో సభా భవనంలో గోష్టి ఏర్పాటు చేసాడు. సావిత్రి, సరస్వతి

బ్రహ్మకు ఇరువైపుల కూర్చుని ఉన్నారు. సనకుడు, సనత్కుమారుడు, నారదుడు, సనందాదులు, ఇతర మునులు బ్రహ్మను సేవిస్తున్నారు. ఆదిత్యాది గ్రహాలు బ్రహ్మ పాదాలను సేవిస్తున్నాయి. సిద్ధులు, సాధ్యులు, మరుత్తులు, కిన్నరులు, కింపురుషులు, అష్ట వసువులు, సభా భవనంలో చుట్టు కూర్చుని ఉన్నారు. ఊర్వశి మొదలైన వారు నాట్యం చేస్తున్నారు. వివిధ వాయిద్యాలు మ్రోగుతున్నాయి. నాట్యకత్తెలు ఒకరితరువాత ఒకరు నాట్యం చేస్తున్నారు.

ఆ సమయంలో ఆలంబన అను దేవతా స్త్రీ నాట్యం చేస్తోంది. గాలి వీచడం వలన ఆమె వస్త్రాలు కొద్దిగా తొలగాయి. ఆమె ఊరువు కనబడుతోంది. సభలోని వారందరు కళ్ళు మూసుకున్నారు. "విధూముడు" అమె సౌందర్యానికి ముగ్ధుడై చూస్తూ ఉండిపోయాడు. బ్రహ్మ విధూముని ప్రవర్తన కనిపెడుతూనే ఉన్నాడు. "విధూమా! నీవు కామలోలుడవై ప్రవర్తించావు కనుక భూలోకంలో జన్మిస్తావు. ఈ దేవతా స్త్రీ అయిన విధూమ నీకు భార్య అవుతుంది' అని శపించాడు. విధూముడు చాల బాధపడ్డాడు. "భగవాన్! ఈ ఘోర శాపంనుండి నన్ను రక్షించు" అని విధూముడు ప్రార్థించాడు. "విధూమా! నా శాపం వ్యర్థం కాదు. అయినా నీ ప్రార్ధన మన్నించి, శాప విమోచనం చేబుతాను. భూలోకంలో ఆలంబను వివాహం చేసుకుని, చాలకాలం రాజ్యం పాలిస్తావు. వార్ధక్యంలో రాజ్యాన్ని నీ కుమారునికి అప్పగించి, దక్షిణ సముద్ర తీరంలో ఉన్న "ఫుల్ల గ్రామ" సమీపంలో ఉన్న చక్ర తీర్థంలో నీవు నీ భార్య కలిసి స్నానం చేయగానే నీకు శాప విమోచనం కలుగు తుంది" అని చెప్పి బ్రహ్మ అంతర్ధానమయ్యాడు. విధూముడు విచారిస్తూ ఇంటికి వచ్చాడు.

"కౌశాంబీ నగరంలో" శతానీకుడు" అను రాజు ఉన్నాడు. అతని భార్య "విష్ణు మతి" ఈదంపతులకు కుమారుడుగా జన్మిస్తాను" అని విధూముడు నిర్ణయించుకున్నాడు. తరువాత తన సేవకులైన మాల్య వంతుడు, పుష్ప దంతుడు, బలోత్కటుడు అను వారికి తన నిర్ణయాన్ని చెప్పాడు.

"విధూమా! నీ వియోగాన్ని మేము భరించలేము. మేము కూడా నీతోబాటు భూలోకంలో జన్మించి సేవ చేసుకుంటాము.శతానీకుని మంత్రి అయిన యుగంధరుడు, సేనా పతి అయిన విప్రతీపుడు, నర్మ సచివుడైన వల్లభునికి మేము ముగ్గురము కుమారులముగా జన్మిస్తాము. అక్కడ నీకు సేవ చేసుకునే అవకాశం మాకు కల్పించు" అని వారు వేడుకున్నారు.

"మీకు నాపై ఎంత వాత్సల్యం ఉందో నాకు తెలుసు. బ్రహ్మ శాపంవల అనుభవించ వలసిన మనుష్య జన్మను నేను ఒక్కడినే అనుభవిస్తాను. మీరు మానవ జన్మ ఎత్తాలని అనుకోకండి" అని విధూముడు హితవు పలికాడు. అయినా వారు విధూమునితో బాటు మానవ జన్మ ఎత్తడానికే నిర్ణయించుకున్నారు.

శతానీకునికి సంతానములేదు. ఒక రోజున శతానీకుడు మంత్రి అయిన యుగంధరుని పిలిచి, " తనకు సంతానం ఎలా కలుగుతుందో చెప్పమని" అడిగాడు. " మహారాజా! శాండిల్యుడు అను ఋషి ఉన్నారు.ఆయనను ప్రార్థిస్తే, మీతో సమానమైన కుమారుని ప్రసాదించగలరు" అని యుగంధరుడు సలహా చెప్పాడు. శతానీకుడు శాండిల్యుని ఆశ్రమం చేరుకున్నాడు. మహర్షికి నమస్క రించాడు. శాండిల్యుడు రాజుకి అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి గౌరవించాడు. ఉచిత ఆసనంపై కూర్చోబెట్టి, విశ్రాంతి తీసుకున్న తరువాత "మహారాజా! మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు? నేను ఏమి సహాయం చేయాలి?" అని అడిగారు. "మహర్షీ! మా రాజు అయిన శతానీకునికి

సంతానం లేరు. మీరు కరుణించి సంతానంపొందే మార్గాన్ని చెప్పమని" మంత్రి యుగంధరుడు ప్రార్థించాడు. శాండిల్యుడు కరుణించి శతానీకునికి సంతానం పొందడానికి కౌశాంబీ నగరానికి వచ్చి, పుత్రకామేష్టి యాగం చేయించాడు. శతానీకునికి విధూముడు "సహస్రానీకునిగా" గా జన్మించాడు. తరువాత క్రమంగా యుగంధరునికి గంధరుడు "యౌగంధరాయుడు" అను పేరుతో జన్మించాడు. సేనాపతి విప్రతీకునికి పుష్ప దంతుడు "రుమణ్వంతుడు" అనుపేరుతో జన్మించాడు. నర్మ సచివుడైన బలోత్కటునికి వల్లభుడు "వసంతకుడు" అను పేరుతో జన్మించాడు. అయోధ్యా నగరానికి రాజు అయిన కృత వర్మకు ఆలంబన "మృగావతి" అను పేరుతో జన్మించింది.ఈ విధంగా విధూముడు మొదలయినవారు భూలోకంలో జన్మించారు.

అహిదంష్ట్రుడు అను రాక్షసుడు దేవగణాలను బాధపెడుతూ ఉండేవాడు. దేవతలకు రాక్షసులకు మధ్య యుద్ధం జరిగింది. ఆ సమయంలో దేవతలు శతానీకుని సహాయం అడిగాడు. శతానీకుడు మాతలిని తీసుకొని స్వర్గం వెళ్ళాడు. శతానీకుడు ఆ యుద్ధంలో మరణించాడు. మాతలి చనిపోయిన రాజును తీసుకొని కౌశాంబి వచ్చాడు. సహస్రానీకుడు తండ్రికి పితృకార్యాలు పూర్తి చేసాడు. మంత్రుల సలహాతో రాజ్యాధికారాలు స్వీకరించాడు. అతని స్నేహితులైన యౌగంధరాయణుడు

మొదలయిన వారి సహాయంతో సహస్రానీకుడు చక్కగా రాజ్య పాలన చేస్తున్నాడు. ఒకరోజున ఇంద్రుడు సహస్రానీకుని నందనవనానికి ఆహ్వానించాడు. సహస్రానీకునికి " బ్రహ్మ శాపవృత్తాంతం ఇంద్రుడు వివరిస్తూ అయోధ్యా నగర రాజునకు దేవతా స్త్రీ అయిన ఆలంబన "మృగావతి" అనుపేరుతో జన్మించింది. ఆమెను వివాహం చేసుకొని, కుమారుని పొంది, అతనికి రాజ్యాధికారం అర్పించి, చక్రతీర్థం వెళ్లి, అక్కడ స్నానం చేసినట్లయిన నీకు శాపవిమోచనం లభిస్తుంది" అని ఇంద్రుడు చెప్పాడు. సహస్రానీకుడు ఆనందంతో తిరిగి భూలోకానికి వస్తున్నాడు. పక్కన ఉన్న తిలోత్తమను పట్టించుకోకుండా వెళ్ళి పోతున్నాడు." రాజా! నేను పిలుస్తున్నా, వినిపించుకోకుండా మృగావతిని మనస్సులో పెట్టుకుని నన్ను ఉపేక్షించావు. అందువలన నీకు, మృగావతికి పదునాల్గు సంవత్సరాలు వియోగం వస్తుంది" అని తిలోత్తమ శపించింది. "మృగాక్షిని నేను పొంద గలిగి, ఆమెతో వివాహం అయితే వియోగ దుఃఖాన్ని అనుభ విస్తాను" అని చెప్పి, తన పట్టణానికి వెళ్ళాడు.

కొంతకాలానికి సహస్రానీకునికి, మృగావతికి వివాహం అయింది. మృగావతి గర్భవతి అయింది. ఒకరోజున ఆమె ఎర్రని నీటిలో స్నానం చేయాలని కోరింది. ఒక దిగుడు బావిలో గులాబీలు వేసి, స్నానం చేయించాడు. ఆ నీటిలో స్నానం చేసిన ఆమె మోదుగ పూవు వలె ఎర్రగా ఉంది. గరుడ పక్షి ఆమెను చూసి మాంసం అని భావించి అపహరించుకు పోయింది. ఆవిధంగా గరుడపక్షి మృగావతిని తీసుకు వెళ్ళి, ఉదయ పర్వత గుహలలో వదిలేసింది."ఓ నాధా! నాకు దిక్కెవరు? మందభాగ్యురాలిని, నీ వియోగం నన్ను బాధపెడుతోంది" అని విచారిస్తూ ఆత్మహత్య చేసుకోవడానికి దగ్గరలో ఉన్న సింహాల దగ్గరకు వెళ్ళింది.

ఆసమయంలో జమదగ్ని శిష్యుడు అక్కడకు వచ్చి, ఆమెను రక్షించి, జమదగ్నికి అప్పగించాడు. జమదగ్ని ఆమెను చేరతీసి, తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించాడు. కొంతకాలానికి ఆమెకు కుమారుడు జన్మించాడు. ఆ బాలుడికి "ఉదయనుడు" అని పేరుపెట్టాడు. జమదగ్ని ఆ బాలుడికి సకల విద్యలు నేర్పించాడు.

ఒకరోజున ఉదయనుడు వేటకు వెళ్ళాడు. అక్కడ ఒక సర్పాన్ని బోయవాడు బంధించాడు. "ఓ వ్యాధుడా! ఈ సర్పాన్ని విడిచి పెట్టు. నీకు తగినంత ధనాన్ని ఇస్తాను" అని పలికి ఉదయనుడు తన తల్లి ఇచ్చిన కంకణాన్ని బోయవానికి ఇచ్చాడు. బోయవాడు సర్పాన్ని ఉదయనునికి ఇచ్చి వెళ్ళిపోయాడు. వెంటనే ఆ సర్పం మనిషిగా మారిపోయింది. అతడు పాతాళ లోకానికి రాజయిన ధృతరాష్ట్రుని కుమారుడు అయిన" కిన్నరుడు". కిన్నరుడు ఉదయునితో స్నేహం చేసి, పాతాళానికి తీసుకు వెళ్ళాడు. కిన్నరుడు తన చెల్లెలు అయిన లలితను ఇచ్చి ఉదయునికి వివాహం చేసాడు. వారికి ఒకకుమారుడు జన్మించాడు. "నాథా! నేను పూర్వ జన్మలో "సుకర్ణి" అను విద్యాధరిని. శాపం వలన నేను సర్పంగా జన్మించాను. నాకు కుమారుడు జన్మించగానే శాపవిమోచనం కలిగింది. ఈ పిల్లవాడిని నీవు తీసుకో. "ఘోషవతి" అను వీణను కూడా తీసుకో" అని పలికి, కుమారుని, వీణను ఇచ్చి లలిత అంతర్ధానమయి పోయింది. ఉదయనుడు తన కుమారుని తీసుకొని తల్లిదగ్గరకు వచ్చాడు. తల్లికి జరిగిన వృత్తాంతం అంతా చెప్పాడు. మృగావతి సంతోషించింది.

ఆ శబరుడు ఉదయనుడు ఇచ్చిన కంకణాన్ని అమ్మడానికి కౌశాంబి నగరం వచ్చి, ఒక వ్యాపారికి చూపించాడు. ఆ కంకణంపై రాజయిన సహస్రానీకుని ముద్ర ఉంది.అది చూసి వ్యాపారి, రాజుకు చూపించాడు. సహస్రానీకుడు మృగావతిని తలచుకొని విచారించారించాడు. " ఈ కంకణం నీకు ఎలా లభించింది? అని అడిగాడు. శబరుడు జరిగినదంతా చెప్పాడు. సహస్రానీకుడు మృగావతిని కలుసుకోవడానికి మంత్రులతో కలిసి బయలు దేరాడు. కొంత దూరం వచ్చాక సైనికులు విశ్రాంతి తీసుకుంటున్నారు. వసంతకుడు విచిత్రమైన కథలు చెప్పుచుండగా సహస్రానీకుడు రాత్రి గడిపాడు. ఉదయాన్నే బయలుదేరి, జమదగ్ని ఆశ్రమానికి చేరుకున్నాడు. జమదగ్ని రాజును యథోచితంగా సత్కరించాడు. "రాజా! మృగావతికి, నీకు ఈ ఉదయనుడు జన్మించాడు. వీరిని నీవు స్వీకరించు" అని జమదగ్ని ఆజ్ఞాపించాడు.

సహస్రానీకునికి ఇంద్రుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. భార్యను, పిల్లవాడిని తీసుకొని రాజ్యానికి బయలుదేరాడు. ఉదయునికి రాజ్యాభిషేకం చేసి సముద్ర తీరానికి బయలుదేరాడు.మృగావతిని,యౌగంధరాయుని,ఋమణ్వంతుడు,వసంతకుని తీసుకొని బయలు దేరాడు, చక్రతీర్థం చేరుకున్నారు. సముద్రంలో స్నానం చేసాడు. చక్రతీర్థంలో శాస్త్ర ప్రకారం స్నానం చేసాడు. అందరు తమ రూపాలను విడిచిపెట్టి, దేవతా రూపాలను పొంది స్వర్గానికి వెళ్ళిపోయారు. ఆరోజునుండి, అందరు చక్రతీర్థంలో స్నానం చేస్తున్నారు. చక్రతీర్థంలో ఒకసారి స్నానం చేస్తే, స్వర్గాన్ని పొందుతారు. ఈ అధ్యాయాన్ని శ్రద్ధగా చదివిన వారికి, విన్నవారి కి కోరిన కోరిన కోరికలు అన్ని తీరుతాయి.

స్కాందపురాణంలోని బ్రహ్మఖండంలోని సేతు మాహాత్మ్యంలోని "ఆలంబ-విధూముల వృత్తాంతము" అను ఐదవ అధ్యాయం సమాప్తం.

# అయోధ్య రామ మందిరం

## కల సాకారం



డా॥కె.రామానందం

జగదాభిరాముడి జన్మస్థలమైన అయోధ్యలోనే రాముడికి గుడి లేని స్థితి ఇన్నాళ్ళూ నెలకొంది. ఈ పరిస్థితికి ఇప్పుడు తెరపడింది. రామ జన్మభూమిలో కనీవిని ఎరుగని రీతిలో ఆలయాన్ని నిర్మించాలన్న భక్తుల కల ఇన్నేళ్ళకు నిజమైంది. పదిహేనుమంది సభ్యులతో రూపుదిద్దుకున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో 2020 ఆగస్టు 20న మందిర నిర్మాణానికి భూమి పూజ జరిగింది. 40 కిలోల వెండి ఇటికతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య ఉద్యమం తర్వాత జాతి మొత్తాన్ని సమైక్యపరిచిన ఏకైక కార్యక్రమం` రామ మందిర నిర్మాణం. చరిత్ర పుటల్లో అయోధ్యలోని రామాలయాన్ని 1529 లో మొగలాయి బాబర్ ధ్వంసం చేసి, బాబ్రీ మసీదు నిర్మించాడు. ఆ తరువాత 1712 వరకు ఆ ఆలయ భూమిని స్వాధీనం చేసుకోవడానికి హిందువులు విఫల ప్రయత్నం చేశారు. 1713 నుంచి 1856 వరకు మసీదు బయట పూజలు చేసుకునేందుకు వెసులుబాటు కలిగింది. 1859లో బ్రిటిష్ పాలకులు బాబ్రీ మసీదుకు, హిందువులు పూజ చేసే ప్రదేశానికి మధ్య కంచెను ఏర్పాటు చేశారు.





అయోధ్య రామ మందిర నిర్మాణానికి 1885లో మసీదు పక్కన అనుమతించాల్సిందిగా సైదాబాద్ స్థానిక కోర్టులో పిటిషన్ వేశారు. కానీ కేసు కొట్టి వేశారు. అయోధ్య రామ మందిరం వివాదంపై మొట్టమొదట కేసు ఇదే. 1949లో బాబ్రీ మసీదులో రామ్ లల్లా విరాజ్మాన్ కొలువు దీర్చారు. మసీదుకు తాళాలు పడ్డాయి. 1950లో వివాదాస్పద స్థలాన్ని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. మసీదు బయట ప్రార్థనలు చేసుకోవడానికి హిందువులకు అనుమతించింది. 1961లో మసీదును తమకు అప్పగించాల్సిందిగా వాక్ఫ్ బోర్డు కోర్టులో కేసు వేసింది.

1984 జూన్ నెలలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో రామ జన్మభూమి ముక్తి యజ్ఞ సమితి పేరిట సాధు సంతుల సమ్మేళనం జరిగింది. 1986 లో బాబ్రీ మసీదు తాళాలు తెరిచేందుకు, హిందువులు కూడా ప్రార్థనలు చేసేందుకు జిల్లాకోర్టు అనుమతించింది. 1989 నవంబర్9న మసీదుకు సమీపంలోని వివాదాస్పద స్థలంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శిలాన్యాస్ కార్యక్రమం చేపట్టింది. 1990 సెప్టెంబర్ 25న బిజెపి నేత ఎల్.కె.అద్వానీ ఆధ్వర్యంలో సోమనాథ్ నుంచి అయోధ్య వరకు రామరథ యాత్ర కొనసాగింది. 29రోజులు పాటు సాగిన యాత్ర అక్టోబర్ 28న బీహార్లో అద్వానీ అరెస్టుతో అర్థాంతరంగా నిలిపివేశారు.

1992 డిసెంబర్ 6న విశ్వహిందూ పరిషత్తు కరసేవకులు రామభక్తులచే బాబ్రీ మసీదు నేలమట్టం అయింది. 2002లో మసీదు చుట్టూ ఉన్న 67.7 ఎకరాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. అలహాబాద్ హైకోర్టులో అయోధ్య కేసు విచారణ ప్రారంభమైంది. చివరకు 2019 నవంబర్ 9న రామ జన్మభూమి ట్రస్ట్కు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. రామాలయ నిర్మాణానికి మార్గం సుగమం అయింది. 1045 పేజీల తీర్పులో రామ్లలల్లా విరాజ్మాన్ది అని తెల్పింది. రామ్లల్లా సాక్షత్తు శ్రీరామచంద్రుడే. ఇప్పుడా భూమి రామాల-



యాన్ని నిర్మిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర పేరిట ఉంది.

సుప్రీంకోర్టులో బాలరాముడి తరపున 92సంవత్సరాలు వయోవృద్ధుడైన పరాశరన్, కోర్టులో ఏకధాటిగా నాలుగు గంటల పాటు వాదనలు వినిపించి కృతకృతులైనారు. సుప్రీంకోర్టు బెంచిలోని ఒక ముస్లిం న్యాయమూర్తి ఒక ప్రశ్న వేశారు. ''బాల రాముడు అయోధ్యలోనే జన్మించినట్లు పురాణాలలో లిఖించబడ్డాయా'' అని అడిగిన ప్రశ్నకు కోర్టు హాలులో ఉన్న ఒక అంధుడు అయిన శ్రీరామభద్రాచార్య స్వామి` లేచి తన వద్ద అనేక ఆధారాలు ఉన్నాయని, ఋగ్వేదంలో 157 శ్లోకాలు ఆసువుగా వినిపించి భక్తుడు కోర్టు వారికి తెలియపర్చారు. ఒక అంధుడు వేదాలలోని అనేక శ్లోకాలు వివరిస్తుంటే జడ్జీతో సహా కోర్టు అంతా నిర్ఘాంతపోయింది. ఆ వేదాలను కోర్టుకు తెప్పించి చూడగా అవన్నీ సాక్షి చెప్పినట్లుగానే లిఖింపబడ్డాయి. సాక్షి మేధస్సును కొనియాడి తమ తీర్పు ఏకగ్రీవంగా బాల రాముడికే దఖలు పర్చింది.

పోటెత్తిన విరాళాలు: స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ళలో గుజరాత్‌లోని సోమనాథ మందిర పునర్నిర్మాణాన్ని అచ్చంగా ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో చేపట్టారు. రామమందిర నిర్మాణాన్ని కూడా అలాగే జరపాలని నిర్ణయించి శ్రీరామ జన్మభూమి రామ్‌మందిర్ నిధి సమర్పణ్ అభయాన్ పేరుతో ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచారు. తొలి విరాళంగా కేంద్ర ప్రభుత్వం తరపున హోం శాఖ అండర్ సెక్రటరీ ఒక రూపాయి విరాళాన్ని ఇవ్వగా, భారత రాష్ట్రపతి శ్రీరామనాథ్ కోవిద్ రు 5,00,100 రూపాయలను తన వంతు విరాళంగా సమర్పించారు. అలా దేశమంతటా కోవిడ్ లాక్‌డౌన్ ఉన్న రెండు నెలల్లో ఈ ఖాతాకు రు.4.60 కోట్లు విరాళాలు జమయ్యాయి. ఆతర్వాత భూమిపూజ జరిగి మందిరనిర్మాణం ఊపందుకోవడంతో దేశ విదేశాల నుండి దాదాపు



రు.5000 కోట్లు విరాళాలు ఇప్పటి-కే అందాయని, ఇంకా విరాళాలు వస్తూనే ఉన్నాయని ట్రస్టు పేర్కొంది. ఇప్పటివరకు రు.900 కోట్లు ఖర్చులు పోనూ ఇప్పటికి తమ వద్ద రు.4000 కోట్లు మిగిలే ఉన్నాయని ట్రస్టు పేర్కొంది. ఇంత తక్కువ సమయంలో ఇన్ని కోట్ల విరాళాలు సేకరణ కార్యక్రమం దేశంలో ఎప్పుడు జరగలేదు. బిచ్చగాళ్ళు, పనులు చేసుకు-నేవాళ్లు, చిల్లర వర్తకులు, ట్రాన్స్ జెండర్లు, పింఛనుదారులు, ఉద్యోగస్తులు, పారిశ్రామికవేత్త-లు, కళాకారులు, మహిళలు, మధ్య వర్గ ప్రజలు, వ్యవసాయ-దారులు, వృత్తి విద్య చేసుకు-నేవారు, ప్రతి ఒక్కరూ తమకు-న్న దానిలో నుంచి ఎంతోకొంత రాముడికిచ్చారు. కొన్నిచోట్ల తమ యావదాస్తి అమ్మి, వచ్చిన సొమ్ము యావత్తు విరాళంగా సమర్పించి, రాముని పట్ల తమ-కున్న ప్రేమను వ్యక్తపరిచినారు.

రామ మందిరం నిర్మాణ విశేషాలు

-అత్యద్భుత రీతిలో సిద్ధమైన రా-మాలయాన్ని డిజైన్ చేసే అదృష్టం గుజరాత్‌కు చెందిన సోమ్‌పురా కుటుంబానికి దక్కింది. 2021వ సంవత్సరంలో నాగర శైలిలో (ఉత్తరాది ఆలయాల్లో కనిపించే నిర్మాణశైలి) డిజైన్‌ను రూ-పొందించారు. ఈడిజైన్ ఆధా-రంగానే రామాలయ నిర్మాణం పూర్తయింది. 1951లో నిర్మి-తమైన సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని డిజైన్ చేసింది కూడా సోమ్‌పురా కుటుంబమే.

-ప్రధాన ఆలయ విస్తీర్ణం ` 2.7 ఎకరాలలో నిర్మాణం జరిపారు. 57,400 చదరపు అడుగుల నిర్మిత ప్రాంత విస్తీర్ణం కలిగి ఉన్నది. ఆలయం పొడుగు 360 అడుగులు, వెడల్పు 235 అడుగులు, ఆలయం ఎత్తు 161 అడుగులతో, మూడు అం-తస్తులు తో అలారారుతున్న-ది. ఒక్కో అంతస్తు ఎత్తు 20 అడుగులు ఉంది. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ర్యాంప్‌లు, లిఫ్ట్ సౌకర్యం కలుగజేశారు.

-రామ మందిరానికి 12 ఆలయ ద్వారాలు. 392 స్తంభాలు, 5,000 పైగా శిల్పాలు, ఐదు మండపాలు



(నృత్య మండపం, కీర్తన మండపం, రంగ మండపం, ప్రార్థన మండపం, కుడుమండపం) ఉన్నాయి. 44 తలుపులు ఉన్నాయి. `ప్రపంచంలో మూడవ అతి పెద్ద దేవాలయం ఎత్తు 161 అడుగులు. శంకుస్థాపనకు 115 దేశాల నీళ్లు, మట్టితో ఆలయ నిర్మాణం జరిగింది. ఇనుము వాడకుండా నిర్మాణం చేపట్టారు. 27 నక్షత్రాలకు సూచికగా నక్షత్ర వాటిక ఆకారంలో ఉంటుంది. 3500సం॥ నిలిచి ఉండేలా కట్టడం ఉన్నది. 10 రిక్టర్ స్కేల్ తీవ్ర భూకంపనికైనా తట్టుకోగల నిర్మాణం జరిగింది.

-ప్రధాన గర్భగుడిలో బాల రాముడి విగ్రహం 51 అంగుళాల ఎత్తు (4.25 అడుగులు) ఈ విగ్రహాన్ని ఆకర్షణీయమైన నల్లని రాతితో (కృష్ణశిల) రాజస్థాన్‌లో తీర్చిదిద్దారు. ధనుర్ధారై కమలంతో నుంచున్నట్లు తయారు చేశారు. విగ్రహ తయారీకి వినియోగించిన రాయి దాదాపు 2.5 మిలియన్ల ఏళ్లనాటిదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ బ్లాక్ గ్రానైట్‌ను మైసూర్ జిల్లా జయపురి హుబ్లీ గ్రామం నుండి తీసుకువచ్చారు. జీవం ఉట్టిపడేలా రాముడు విగ్రహాన్ని చెక్కిన శిల్పి శ్రీ అరుణ్ యోగిరాజ్‌గారు. శ్రీరామనవమి రోజున సూర్యకిరణాలు రాముడు ముఖం మీద పడేవిధంగా ఈ విగ్రహం ఎత్తును నిర్ణయించారు.

-గర్భాలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించే ముందు శ్రీరామ యంత్రాన్ని విగ్రహం అడుగున ప్రతిష్ఠించారు. చీరాల వాస్తవ్యులైన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, హనుమాన్ ఉపాసకులు ఈ యంత్రాన్ని సిద్ధపరిచి, తను భక్తితో చేసిన 14 కోట్లు రామ నామ జపాన్ని

ధారపోసి, రెండు నెలల క్రితమే ఆయన ఆ యంత్రాన్ని ఆలయ ట్రస్టీలకు అందజేసి ధన్యత చెందిన మన తెలుగువారు.
-తెల్లని పాలరాతి (మక్రానా మార్బుల్)తో తీర్చిదిద్దిన రామ మందిరంలోని గర్భగుడిలో ఎనిమిది అడుగుల ఎత్తు, మూడడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పుతో పాలరాతి సింహాసనాన్ని చెక్కారు. బంగారు తొడుగువేసినఆసింహాసనంమీద బాల రాముడుని ప్రతిష్ట చేశారు.

బాల రాముని ప్రాణ ప్రతిష్ట
-జనవరి 16 2024 నుంచి 22 వరకు బాల రాముడి విగ్రహానికి వేద పండితులచే దశవిధ స్నానాలు, గణేశ, అంబిక పూజలు, నవగ్రహ స్థాపన, 125 కలశాలతో దివ్య స్నానం శాస్త్రోక్తంగా జరిపారు. రామ్‌లల్లా విగ్రహాన్ని అయోధ్య పురవీధులలో ఊరేగించారు. ఊరేగింపులో అనేక వాయిద్య బృందాలు, కోలాటాలు, భజన బృందాలు, నృత్యకారులు అత్యంత ఉత్సాహముతో పాల్గొన్నారు.
-ఇంతకాలం చిన్నశాలలో పూజలందుకుంటున్న ఐదారు అంగుళాల ఎత్తు మాత్రమే ఉన్న రామ్‌లల్లా విగ్రహాన్ని సుందరంగా అలంకరించి సింహాసనం పైమెట్టుపై ఉంచారు. ఇకపై రామ్‌లల్లా రామ మందిర గర్భగుడిలో పూజలు అందుకుంటుంటాడు.
-ప్రాణప్రతిష్ట నాడు అనగా ది.22 జనవరి 2024 రోజున బాల రామునికి అలంకరించిన బంగారు ఆభరణాలు మిరుమిట్లుగొలుపుతూ భక్తులకు నయనానందకరం చేశాయి. స్వామికి తిలకం, ధనస్సు, బాణం, కిరీటం, ఐదు పేటల విజయ హారాలు, వడ్డాణం, చేతి పట్టీలు, కడియాలు, కాలి మువ్వలు, ముద్రిక ఉన్నాయి. 14 రకాల ఆభరణాలను లఖనవూకు చెందిన హర్ష హైమత్ శ్యామలార్ జువెలర్స్ వారు కడు శ్రద్ధా భక్తులతో 132 స్వర్ణకారుల సహాయంతో 15 రోజుల వ్యవధిలో వజ్రాలు, పచ్చలు, కెంపులును చక్కగా బంగారు నగలకు అమర్చారు. బాల రాముడి కిరీటం అత్యద్భుతంగా కనబడుతుంది. కిరీటం మధ్యలో సూర్యుడు బొమ్మ కనిపిస్తుంది. రామ్‌లల్లాను బనారసీ వస్త్రంతో అలంకరించారు. పసుపుపచ్చ పంచెతో పాటు ఎరుపు రంగు అంగవస్త్రం ధరింప జేశారు. అంగవస్త్రంపై శంఖం, పద్మం, చక్రం, మయూర్ లను చిత్రించారు. ఈ వస్త్రాలను ఢిల్లీకి చెందిన డిజైనర్ మనీష్ త్రిపాఠి రూపొందించారు.
-పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూల హారాలతో అలంకరింపబడిన చిన్నారి రాముడిని చూడడానికి భక్తులకు తమ రెండు కళ్ళూ సరిపోలేదంటే అతిశయోక్తి లేదు. ఆయన విగ్రహం అపురూపంగా ఉంది. మందహాసం, ప్రసన్న వదనంతో చూపురలను పలకరిస్తున్నట్లుగా నయనానందకరంగా కనిపించాడు. స్వర్ణాబ రణ భూషితడైన రాముడి దర్శనంతో నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న భారతావని అలౌకిక ఆనందంతో పులకించిపోయింది.
-సరిగ్గా 12.29 గంటలకు అభిజిత్ లగ్నంలో భారతదేశ ప్రధాని మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేతుల మీదుగా బాల రాముడికి ప్రాణప్రతిష్ట శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా పూర్తయింది. ప్రధాని మోదీ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య యజమానిగా వ్యవహరించారు. ఆయన సమక్షంలో ఆలయంలో తొలుత ప్రత్యేక పూజలు జరిగాయి. తరువాత గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ట క్రతువు చేపట్టారు. పండితులు మూలమంత్రాలను పఠిస్తుండగా, తొలుత విగ్రహం కళ్ళకు ఆచ్ఛాదనగా కట్టిన వస్త్రాన్ని మోదీ తొలగించారు. అనంతరం బంగారంతో చేసిన చిన్న కడ్డీతో బాల రాముడు కళ్ళకు కాటుకది-

ద్దారు. తర్వాత ఆయనకు అద్దాన్ని చూపించారు. తామర పువ్వును ప్రధాని రాముని పాదాల వద్ద ఉంచి సాష్టాంగ నమస్కారం చేశారు. మహా హారతిని మోదీ ఇచ్చారు

-దివ్య తేజస్సుతో బాల రాముడు కొలువు దీరడాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన భక్తకోటి పరవశించి పోయింది. ప్రాణ ప్రతిష్ఠ సమయంలో, హారతి సమయంలో ఆలయంలో ఉన్న భక్తులు, టీవీల వద్ద కూర్చుని తిలకిస్తున్న కుటుంబ సభ్యులు, పలుచోట్ల ఏర్పాటుచేసిన భారీ తెరల ముందు కూర్చొన్న అశేష ప్రజానీకం రామ నామస్మరణాలు, “జైశ్రీరామ్” నినాదాలు హోరెత్తగా, కాషాయ జెండాలు రెపరెపలాడాయి. అన్ని వర్గాల ప్రజలు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ప్రాణ ప్రతిష్ఠ సమయాన అయోధ్య రామాలయంపై హెలికాప్టర్ తో పూల వర్షం కురిపించారు.

-ఈ పవిత్ర క్రతువును పూర్తి చేయడానికి ప్రధాని మోదీ అంకితభావంతో జనవరి 12 నుండి పంచవటిలో ఉపవాస దీక్ష 11రోజులు చేపట్టారు. దక్షిణాన రామునితో సంబంధం ఉన్న కొన్ని దేవాలయాలను దర్శించారు. రామేశ్వరం ఆలయంలోని 22 బావులలో స్నానం చేశారు. సముద్ర స్నానం చేశారు.రామేశ్వరలింగాన్ని దర్శించుకున్నారు. దీక్షా సమయంలో నేల మీదనే నిద్రిస్తూ, కొబ్బరి నీళ్లను మాత్రమే సేవిస్తూ, రాముని భక్తునిగా వచ్చి తనవంతుగా వెండి ఛత్రాన్ని, పట్టు వస్త్రాలను బాల రామునికి సమర్పించారు. ప్రాణ ప్రతిష్ఠ క్రతువు పూర్తయిన పిమ్మటనే, రామచరణామృతాన్ని స్వీకరించి దీక్షను విరమించారు.

-అయోధ్య రామ మందిర నిర్మాణంలో పాల్గొన్న కార్మికులపై ప్రధాని పూలను చల్లారు. వారిని కలిసి అభినందించారు. ఆరోజు రాత్రి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. లక్షలాది దీపాలను సరియూనది ఘాట్లలో వెలిగించారు. ప్రధాని ఢిల్లీ లోని తన నివాసంలో దీపాలు వెలిగించి రాముడిపై తనకున్న అపారమైన భక్తిని చాటుకున్నారు.

-రామ ప్రాణ ప్రతిష్ఠ సంబరాలకు 11000 మందికి పైగా అతిథులకు ఆహ్వానం పంపగా ఏడు వేలమందికి పైగా ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, సినీనటులు, క్రీడాకారులు, సాధుపుంగవులు, పలు పీఠాధిపతులు కార్యక్రమాన్ని వీక్షించి, బాల రాముని దర్శనం చేసుకుని పునీతులయ్యారు..

-ఆలయ నిర్వహకులు అతిథుల నిమిత్తం 7000 టెంట్‌లు తాత్కాలికంగా నిర్మించి వారికి వసతి ఏర్పాటు చేశారు.

-దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు అయోధ్యలో వాల్మీకి విమానాశ్రయమునకు తమ తమ పట్టణాలు, నగరాల నుంచి ప్రత్యేక (చార్టర్) విమానాలలో వచ్చారు. విమానాశ్రయమంతా 100 చార్టర్ విమానాలతో నిండిపోయింది.

-అతిథులందరికి ఆలయ అధికారులు ఏడు రకాల ప్రసాదాలను బాక్స్‌లలో పెట్టి అందజేశారు. అయోధ్య నగరమంతా రాత్రిపూట విద్యుత్ దీపాలతో అలంకరించుట ఒక ఆకర్షణ. అయితే సరయూనది స్నానఘట్టాలలో 10 లక్షల దీపాలు వెలిగించడం మరో ఆకర్షణ అయింది.

-ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మొదలు మహా మంగళహారతి ఇచ్చేవరకు 25 రాష్ట్రాలకు చెందిన వాయిద్య కారులు, 50 రకాల పరికరాలతో మంగళ ధ్వని వినిపించారు. సోనూనిగమ్, అనూరాధపౌడ్వాల్, శంకర మహదేవన్ వంటి ప్రముఖులు రాముడిపై పాటలు పాడారు. అతిథులందరూ భక్తితో వింటూ భజనలు చేశారు. తన్మయత్వం జెందారు.

-అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ

ప్రతిష్ఠాపన కోసం అయోధ్యకు తరలివచ్చిన రాజకీయ, సినీ క్రీడా రంగానికి చెందిన ప్రముఖుల- లో మాజీ ప్రధానమంత్రి దేవేంద్ర గౌడ్, ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ రవి శంకర్, యోగ గురువు` రాందేవ్ బాబా, సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.రమణ, తెదేపా అధినేత చంద్రబాబు, సినీ, క్రీడా ప్రముఖులు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, చిరంజీవి దంపతులు, పవన్ కళ్యాణ్, సచిన్ టెండూల్కర్, రామ్ చరణ్, అభిషేక్ బచ్చన్, ఆలియా భట్, కత్రినా కైఫ్, అనుపమ కేర్, రిషబ్ శెట్టి, అనిల్ కుంబ్లే, సైనా నెహ్వాల్, మిథాలి రాజ్ మొదలగు వారు హాజరయ్యారు. రామ మందిర ప్రారంభోత్సవాని- కి 11000 మంది ఆహ్వానించగా, అందులో 508 మందిని అత్యంత ప్రముఖులుగా గుర్తించారు. బాల రాముడు ప్రాణప్రతిష్టా నంతరం ఆలయ ప్రాంగణం- లో ఏర్పాటుచేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ ` బాల రాముడు కొలువు తీరాడు. "జైసియారా- మ్" అని నినదించిన మోడీ. మన రామ్‌లల్లా ఇక టెంట్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ముమ్ముందు బలమైన, ఘనమైన, దివ్యమైన భారత్‌ను వచ్చే వెయ్యే- ళ్ల కోసం నిర్మించాలి. ఆ దిశలో పనిచేస్తామని ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలన్నారు. దశాబ్దాల పాటు కొనియాడిన అయోధ్య వివాదా- న్ని పరిష్కరించినందుకు న్యా- యవ్యవస్థకు మోడీ ధన్యవాదాలు చెప్పారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన రామా లయ నిర్మా- ణంకు పాటుపడిన ప్రతి కార్మికు- డిని కొనియాడారు. రామనామం ఈ దేశ ప్రజల ప్రతి కణంలో నిండి ఉంది. దేశ సంస్కృతి కట్టుబాట్ల- కు రాముడే మూలం. రాముడే నిత్యం. ఆయనే శాశ్వతం. ఆయనే అందరివాడు. ఆయనే విశ్వాసం అని మోడీ పేర్కొన్నారు.

మందిర ప్రాంగణంలో జటాయు వు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కుబేర శిలను సందర్శించి శివ- లింగానికి అభిషేకం, ప్రదక్షిణాలు చేశారు. ప్రధాని అతిధులున్న ఏరి- యాలను, ఒక్కొక్కటిగా దర్శించి అచ్చటి అతిధులందరును అభి- నందిస్తూ ముందుకు సాగారు.

రామ మందిరంలో నిత్య పూజలు, ఉత్సవాలు శాస్త్రీయంగా జరిపిం- చుటకు ఆలయ ప్రధాన అర్చకు- నిగా ఉత్తరప్రదేశ్ లోని సీతాపూ- ర్‌కు చెందిన మోహిత్ పాండేకు తొలి పూజలు చేసే భాగ్యం లభించింది. ఠaజియాబాద్‌లోని దూదేశ్వర్ వేద విద్యాలయంలో- ను, తిరుమల తిరుపతి దేవస్థా- నాల ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వర వేద పాఠశాలలో మోహిత్ పాండే వేద విద్యను అభ్యసించారు. రామ ప్రాణ ప్రతిష్ఠ వేడుక- ల్ని హిందూ కాలమాన ప్రకారం పుష్య మాసం, శుక్లపక్ష ద్వాదశి. దీన్నే కూర్మ ద్వాదశని కూడా అంటారు. విష్ణుమూర్తి దశావతా- రాల్లో రెండోదైన కూర్మావతారాన్ని ధరించిన రోజు అది. క్షీరసాగర మధనం సమయంలో కూర్మా- వతారంలో భూమాతను మోసిన సందర్భం. రాముడు కూడా విష్ణు అవతారమే కాబట్టి ఆరోజును ఆయనకు శుభదినంగా పరిగ- ణించారు. ఏదైనా మంచి పని చే- యడానికి అనువైన రోజుగా దీన్ని భావిస్తున్నారు.

రామ మందిర ప్రారంభోత్సవా- నికి వి.వి.ఐపీలు భారీగా తరలి రావడంతో పోలీసులు బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సి.సీ.కెమెరాల నిఘా ఉంచారు. డ్రోన్లను, వాచ్‌టవర్లను వినియోగించారు. ప్రాణ ప్రతిష్ఠ వేడుకను చూసేందుకు వ్యాపా- రులంతా దుకాణాలను మూసి- వేయడంతో అయోధ్య వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ధర్మపథ్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 10000 కెమెరా-

లతో అయోధ్య మొత్తాన్ని నిఘా పరిధిలోకి తెచ్చారు. కార్యక్రమ-మంతా సజావుగా శాంతియుతం-గా ముగిసింది.

కార్యక్రమానంతరం అతిథుల-నందరను క్రమ పద్ధతిలో బాల రాముని దర్శనార్థం పంపించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ది23 జనవరి 2024 మంగళవా-రం నుంచి సాధారణ భక్తులను ఆలయంలోకి అనుమతించారు. బాల రాముని దర్శనం చేసుకు-నేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు లాంటి ఏదో ఒక ధ్రువపత్రం తీసు-కువెళ్లాలి. వారు ముందే ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో కానీ, ప్రత్యక్షంగా ఆలయం వద్ద కానీ, హారతి పాస్ తీసుకున్నాకనే హారతి సమ యంలో అనుమ-తిస్తారు. పదేళ్ల లోపు పిల్లలకు మాత్రమే మినహాయింపు ఉన్నది. ప్రసాదాల తయారీ ఏర్పాటు ఇంకా పూర్తి కాలేదు కాబట్టి అప్పటివ-రకు భక్తులకు పంచడానికి ఇలా-చీదానా ప్యాకెట్‌ల్లో సిద్ధం చేస్తు-న్నారు. మంగళవారం రోజున బాల రాముడిని ఐదులక్షలమంది దర్శించుకున్నారు. రు12.70 కోట్ల విరాళాలు వచ్చినట్లుగా ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆలయ దర్శన వేళలు: ఉదయం 7 గంటల నుంచి 11:30 గంటల వరకు మధ్యా-హ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులు దర్శించుకోవచ్చు.

హారతి వేళలు:

జాగరణ హారతి ఉదయం 6:30 గంటలకు ఒకరోజు ముందుగా అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలి. సంధ్యా హారతి రాత్రి 7:30 గంటలకు అందుబాటును బట్టి అదే రోజు బుక్ చేసుకోనే సదుపాయం ఉంది.

ఆన్‌లైన్ బుకింగ్ కలదు.

అపురూపం- ఈ కానుకలు రామ్‌లల్లాకి భిన్న వర్గాలకు చెందిన ప్రజల నుంచి అపురూ-పమైన కానుకలు వెల్లువెత్తు-తున్నాయి.

ఆంధ్ర రాష్ట్రాల నుండి కానుకలు

-హైదరాబాద్‌కి చెందిన లోహ-శిల్పి పిట్టంపల్లి రామలింగా-చారి. పంచలోహాలతో రెండు జతల పాదుకలను తయా-రుచేసి వాటికి వెండి బంగారు తాపడం చేసి సమర్పించారు.

-ధర్మవరం నుంచి సహజ రంగులతో రామాయణ ఘట్టా-లను నేసిన పట్టు వస్త్రా-న్ని కానుకగా పంపనున్నారు.

-తిరుమల తిరుపతి దేవస్థానం వారు వెంకటేశ్వర స్వామి చిన్న లడ్డూలను రెండేసి ఒక ప్యాక్‌లో ఉంచి, అటువంటివి లక్ష ప్యాకె-ట్లను అయోధ్య బాల రామునికి పంపించారు.

-కళా కుటీర్, ఓల్డ్ బోయిన బో-యినపల్లి హైదరాబాద్ వారు 12 కేజీల బరువు గల బంగారు రా-మపాదుకలను సమర్పించారు.

-వెంకట్ గారు తార్నాక, హైదరా-బాదులో ముత్యాల వ్యాపారి. వీరు ఎనిమిది అడుగుల పొడవున్న అత్యంత సుందరమైన ముత్యాల హారాన్ని అందజేశారు.

సనత్ నగర్, హైదరాబాద్ హనుమాన్ టెంపుల్ వారు పో-చంపల్లి పట్టు వస్త్రాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

-సికింద్రాబాద్ వాసి నాగభూ-షణ రెడ్డి గారు 1265 కిలోల బరువు గల లడ్డూని తయారు చేయించి రామ మందిరం బాల రాముడికి అందజేశారు.

-సికింద్రాబాద్‌లోని అనురాధ టింబర్‌డిపో వారు ఆలయానికి కావలసిన సింహద్వారం, గర్భగుడి తలుపులు తయారుచేసి ఇచ్చారు. వాటిపై ట్రస్ట్ వారు బంగారు పూతతో తొడుగు చేయించారు.

-అయోధ్య రామయ్య శ్రీ చల్లా శ్రీనివాసరావు గారు వెదురు-పాక గ్రామం నుండి కాలినడ-కన అయోధ్యకు చేరి 13 జనవరి 2024న రు.1.2 కోట్ల విలువైన బం-

గారుపాదుకలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గార్కి రాముని పూజలో వాడుటకు ఇచ్చి వారి ప్రశంసలు అందుకున్నారు.

ఇతర కానుకలు :

-సీతాదేవి పుట్టిల్లు జనకపురి నుంచి 1100 బుట్టల్లో సారె. అందులో నగలు, పట్టు వస్త్రాలు, మిఠాయి, సుగంధద్రవ్యాలు ఉన్నాయి. కాశ్మీరు ముస్లింలు బాలరాముడికి కానుకగా స్వచ్ఛమైన రెండు కిలోల కుంకుమపువ్వు పంపించారు. ంసూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి 5000 వజ్రాలు పొదిగిన బంగారు రెండు కిలోల బరువుగల హారం సమర్పించారు. ంతమిళనాడులోని నమ్మక్కల్ నుంచిఅష్టధాతువులతోతయారైన 40 గంటలు, యూపీ నుండి పెద్ద గంట అయోధ్యకు చేరాయి. ంలఖనవూకు చెందిన ఓ కూర గాయల వ్యాపారి అనిల్ సాయి 9 దేశాలు సమయాన్ని చూడగలిగే ఒక గోడ గడియారం సమర్పించారు. ంరాజస్థాన్ నుండి ఆరు వేల కిలోల ఆవు నెయ్యి రాముని అభిషేకం నిమిత్తం ఇచ్చారు. ంవడోదర కి చెందిన ఓ వ్యక్తి 108 అడుగుల అగరబత్తి పంపారు. ఇది 45 రోజులు వెలుగుతుంది. ంపాట్నాలోని మహావీరప్పన్ వారు సమర్పణ` బంగారు ధనుర్బాణం. -మిథిలానగరం నుంచి తలపాగాలు కానుక. -చత్తిస్‌ఘడ్ వాస్తవ్యులు శ్రీమతి కౌసల్యాదేవి 300 టన్నుల బియ్యం, కూరగాయలు పంపారు. ంసూరత్ వజ్రాల వ్యాపారి దిలీప్ కుమార్ 101 కిలోల బంగారం సమర్పించారు.(విలువ 68 కోట్లు) ఇంకా ఎందరో వస్తురూపేణా కానుకలు భక్తులు రామ మందిరానికి విరాళాలు సమర్పణ చేస్తూనే ఉన్నారు.

భారీ మౌలిక వసతులతో మారిన నగర రూప రేఖలు: రామాలయం భూమి పూజ జరిగిన పిమ్మట ఇక్కడ మౌలిక వసతులు కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు చేపట్టాయి. అంతర్జాతీయ స్థాయిలో ఈ నగరానికి గుర్తింపు కలిగించాలని యూపీ ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారు. ఈ నగరంలో ఇప్పటికే కొన్ని 1.కొత్త విమానాశ్రయం 2.ఆధునికరించిన రైల్వే స్టేషన్ 3.రామపద్, ధర్మపద్ పేరుతో రెండు సువిశాల రహదారులు 4.ధర్మపద్ వెంబడి 40 సూర్య స్తంభాలను ఏర్పాటు చేశారు. 5.విలాసవంతమైన హోటళ్ళు, బడ్జెట్‌లోగిళ్ళు వెలిశాయి. 6.ఆలయానికి భక్తులు సులువుగా చేరుకోవడానికి వీలుగా నాలుగు రహదారులను పునరాభివృద్ధి చేశారు. ఇందులో 13 కిలోమీటర్ల రామపద్ కూడా ఉంది. 7.నగర పారిశుద్ధ్య వ్యవస్థ అభివృద్ధి, మురికి నీటిశుద్ధ వ్యవస్థ ఏర్పాటు వగైరాలు వచ్చే పర్యాటకుల తాకిడిని తట్టుకునేలా ప్రణాళికలు అమలు చేశారు. దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతూ వందే భారత్ రైళ్ళు ఉన్నాయి. నక్షత్రాల హోటళ్ళు హైవే లో ఊహించని రీతిలో అభివృద్ధి చెందాయి. మరెన్నో రానున్నాయి.

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ క్రింద మొత్తం ఆలయ ప్రాంతం అభివృద్ధి పథకంలో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టనున్నారు వాటిలో ముఖ్యమైనవి శ్రీశ్రీరామ్ కుంజ్ యజ్ఞశాల శ్రీకర్మక్షేత్ర (అనుస్థాన మండపం) శ్రీపురావత్తు చారిత్రక చిహ్నాల ప్రదర్శన సేవ శ్రీసత్సంగ ప్రార్థన హాలు శ్రీహనుమంతుడు ఎత్తైన విగ్రహం శ్రీగురు వశిష్ట పీఠిక శ్రీతులసి ఓపెన్ ఎయిర్ రామలీల థియెటర్ శ్రీరామ దర్బార్ (కమ్యూనికేషన్ సెంటర్) శ్రీమాతా

కౌసల్య వాత్సల్య మండపం శ్రీరామాశ్రయం (బహుళ అంతస్తుల బోర్డింగ్ లాడ్జింగ్) శ్రీలక్ష్మణ వాటిక (మ్యూజికల్ ఫౌంటెన్) శ్రీలవకుశ నికుంజ్ (పిల్లల కోసం కార్యక్రమాలు) శ్రీమర్యాద ఖాండ్ (విఐపి అధితుల నివాసం) శ్రీమాత సీతా రసోయి (అన్నదాన కేంద్రం) శ్రీభారత్ ప్రసాదమండప్ (ప్రసాదాల తయారీ) శ్రీసింహద్వారానికి ఎత్తుగా దీప స్థంభం శ్రీనగరంలో పలుచోట్ల పెద్ద విగ్రహాల ఏర్పాటు అయోధ్య ఒకప్పుడు ఏడు ప్రధాన తీర్థయాత్ర స్థలాల్లో (సప్త మోక్షపురాలు) ఒకటిగా పేరుంది. రాబోయే 10 ఏళ్లలో నగర అభివృద్ధికి రు. 85 వేల కోట్లు వెచ్చించనున్నది. సందర్శకులకు సకల సౌకర్యాలు ఉండేలా కొత్త టౌన్‌షిప్ మరియు సరయునది సుందరీకరణ జరుగుచున్నది. సోలార్ సిటీ ప్రోగ్రాంలో భాగంగా మార్చి 2024 నాటికి 40 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పూర్తిస్థాయిలో పనిచేయనుంది. ప్రపంచవ్యాప్తంగా రామోత్సవములు 2024 జనవరి 22... ఇది కేవలం తారీఖు మాత్రమే కాదు రామ కాలచక్రానికి ప్రతీక. ఈ తేదీకి పరిపూర్ణ దివ్యత్వం ఉంది. కొన్ని వందల ఏళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తు చేసుకుంటారు. కౌసల్య తనయుడు ప్రసన్న వదనంతో బాల రాముడి రూపంలో అయోధ్యలో భవ్యమైన రామ మందిరంలో కొలువయ్యాడు. కళ్ళ ముందు దివ్య మంగళ సుందర రూపం ఆవిష్కృతం కాగానే భక్తకోటిలో పరవశం వర్ణనాతీతం. ముద్దులు మూటగట్టేలా ఉన్న ఆ చిన్నారి రాముని చూడ్డానికి భక్తులు రెండు కళ్ళు సరిపోలేదు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తిలకించడానికి దేశం నలుమూలలా కనపడుతున్న భక్తిశ్రద్ధలు, ఉత్సాహోత్సవాలు జోడిరచి పండుగగా అట్టహాసంగా జరుపుకున్నారు. అదే రీతిగా ఆయా దేశాలలో రామోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

▪ అమెరికాలోని ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ వద్ద ప్రత్యక్ష ప్రసారం చేశారు. సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ వేడుకను వీక్షించారు. భక్తితో పాటు నృత్యాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. లాస్ ఏంజెలెస్ రహదారులలో 250కార్లుతో ర్యాలీ నిర్వహించారు. వర్జినియాలోని లోటస్ టెంపుల్ లో సిక్కులు, ముస్లింలు వేడుకల్లో పాల్గొన్నారు.

▪ యూఎస్, కెనడాల్లో 45 రోజుల యాత్రను ప్రకటించారు. మసాచుసెట్స్ లోని బిల్లేరికలో రాబోవు మార్చి 25 నుంచి యాత్ర ప్రారంభం కానుంది. వెయ్యికి పైగా ఆలయాలను 45 రోజుల్లో దర్శించుకునేందుకు వీలుగా విశ్వ హిందూ మండల పరిషత్ సంస్థలు ఒక ప్రోగ్రాం రూపొందించింది.

▪ మెక్సికోలో క్వేరేటా నగరంలో మొదటి రామ మందిరం 21 జనవరి తేదీన ప్రారంభించారు. ఈ మందిరంలో విగ్రహానికి అమెరికన్ పూజారి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

▪ మారిషెస్‌లో ఫిజి దేశంలో కరీబియన్ దీవుల్లోని ట్రినిటాడ్ అండ్ టోబాగో దేశాలలోనూ వేడుకలు నిర్వహించారు. మారిషెస్ ప్రభుత్వం రామ ప్రతిష్ఠ వేడుకలు తిలకించటానికి హిందూ ఉద్యోగులకు రెండు గంటల అనుమతి మంజూరు చేసింది.

▪ బూర్జ్ ఖలీఫాపై విద్యుత్ కాంతుల మధ్య శ్రీరాముని చిత్రాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులందరినీ ఆకట్టుకుంది.

హైదరాబాదులో వేడుకలు: హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరిగాయి. ఇళ్ళపై శ్రీరాముడి జెండాలు రెపరెపలాడాయి. శోభాయమానంగా తీర్చిదిద్దిన ఆలయాల దర్శించుట-

కు భక్తులు పోటెత్తారు. కాషాయ జెండాలు కట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. ఇళ్లల్లో పిండి వంటలు, స్వీట్లు చేసుకున్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై రాజభవన్ ఆవరణలో నామ కీర్తనలు భజనలు ఏర్పాటు చేశారు. ముచ్చింతల్‌లో రాములోరి కళ్యాణాలు చక్కగా శ్రీ వెంకయ్యనాయుడుగారి (మాజీ ఉప రాష్ట్రపతి) సమక్షంలో నిర్వహించారు. అనేకచోట్ల హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు. వీహెచ్పీ, ఆర్ఎస్ఎస్ తదితర సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పురజనులు భారీ తెరలముందు కూర్చొని ప్రత్యక్ష ప్రసారం తిలకించారు. భక్తులకు అక్షింతలు తీర్థ ప్రసాదములు, అన్నదానాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కొన్నిచోట్ల ముస్లింలు లడ్డూలు పంచి తమ ఆనందాన్ని, మతసామరస్యాన్ని చాటుకున్నారు. నగరంలో ప్రతి ఒక్కరూ రాత్రివేళ దీపాలు వెలిగించడం ద్వారా దీపావళి పర్వదినాన్ని గుర్తు చేశారు. మరియు పటాసులు పెద్ద సంఖ్యలో కాల్చి తమ భక్తి భావం చాటుకున్నారు. నిజాం కాలేజీ ప్రాంగణంలో 1528 నుంచి 2022 వరకు అయోధ్య రామాలయ చరిత్రకు సంబంధించిన ఫోటోలతో చిత్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

మధురలో అయోధ్య సంబరం: శ్రీకృష్ణ జన్మస్థలి మధురలో అయోధ్య వేడుకలు ఘనంగా జరిగాయి.

రాధాకృష్ణ మందిరంలో సీతారాముల విగ్రహాలను పెట్టి పూజలు నిర్వహించారు. ఆరోజున అధిక సంఖ్యలో దీపాలు వెలిగించారు. మంత్రాలయంలో 59 అడుగుల శ్రీరామ విగ్రహాన్ని సోమవారంనాడు రాఘవేంద్రమఠం పీఠాధిపతి ఆవిష్కరించడం జరిగింది. ఒరిస్సా రాష్ట్రంలో రామాలయ నిర్మాణం జరుగుతున్నది. గ్రామంలో ఈరామాలయ మందిరం 2017వ సంవత్సరం నుంచి పనులు జరుగుతున్నాయి. ఈ ఆలయం ఎత్తు 165 అడుగులు. మహారాష్ట్రలోని కోలాడి ప్రాంతంలో శ్రీ మహాలక్ష్మి జగదాంబ మందిరంలో 6వేల కేజీల హల్వా తయారుచేసి బాలరాముడికి ఈ జనవరి నెలాఖరి వరకు అయోధ్య మందిరానికి అందజేస్తారు.

ప్రాణ ప్రతిష్ట రోజునే పెద్ద సంఖ్యలో కాన్పులు: అయోధ్యలో బాల రాముడు దివ్య ముహూర్తంలోనే బిడ్డకు జన్మనివ్వాలని కలలు కన్న దంపతులు వైద్యులను సంప్రదించి సోమవారం 22వ తేదీని కాన్పు జరిగే లాగా ఏర్పాటు చేసుకున్నారు. అవసరమైతే సిజెరియన్ ఆపరేషన్‌లకు సిద్ధపడ్డారు. ప్రాణప్రతిష్ట రోజేనే ఆ శ్రీరాముడే తమ ఇంట పుట్టాడని మురిసిపోయారు. చాలామంది మగ బిడ్డలకు రామ అని ఆడపిల్లలకు సీత అని పేర్లు పెట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ ఫీరోజాబాదు జిల్లా ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చిన ఫర్జానా అనే ముస్లిం మహిళ తన శిశువుకు రామ్ రహీం అని పేరు పెట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక ఆసుపత్రిలో 25మందికి సోమవారం నాడు కాన్పులు జరిగినట్లు వైద్యులు తెలిపారు. చాలామంది తమ బిడ్డలకు రామ్ అని లేదా ఆ పేరును సూచించే రాఘవ్, రఘు, రాఘవేంద్రలాంటి పేర్లు పెట్టుకున్నారు. హైదరాబాదులో కిమ్స్ ఆస్పత్రిలో మూడు జంటలు సోమవారం రోజున బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ నేపథ్యంలో స్వయంగా ఆ బాల రాముడు తమ ఇంట అడుగు పెట్టినంతగా ఆ దంపతులు మురిసిపోయారు.

**జై శ్రీరామ్**

# మెరుపుల్లేని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ 2024

కేంద్ర ఆర్థిక మంత్రి, శ్రీమతి నిర్మలా సీతారామన్ గారు రూ 47.66 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్‌సభలో ది 1 ఫిబ్రవరి 2024న ప్రవేశపెట్టారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలున్న నేపథ్యంలో అప్పటివరకు ఆదాయవ్యయాలకు సంబంధించి ప్రవేశపెట్టే స్వల్ప కాలిక పద్దును సమర్పించారు. ఓట్ ఆన్ అకౌంట్ అనేది కేవలం వ్యయానికి సంబంధించింది. దీని ఆమోదానికి పార్లమెంట్‌లో చర్చ అవసరం ఉండదు. ఆమె ప్రసంగం 58 నిమిషాలు పాటు సాగింది. పన్నురెట్లలో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు.

బడ్జెట్ ప్రసంగ హైలైట్స్:

శ్రీటెక్నాలజీ పై ఆధారపడే నేటి యువతకి లక్ష కోట్ల పెట్టుబడి వ్యవస్థ ఏర్పాటు కానున్నది. దీని ద్వారా వడ్డీలేనిలాంగ్‌టర్మ్,రీఫైనాన్సింగ్ సదుపాయం ఉంటుంది.

శ్రీఅంగన్వాడి, ఆశా కార్యకర్తలు, వారి సిబ్బందిని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భీమా పథకంలో తీసుకోనున్నారు.

శ్రీమధ్యతరగతి ప్రజల కోసం బస్తీలు, అద్దె ఇళ్లల్లో ఉండేవారి సొంతింటి కల నెరవేరుస్తున్నారు.మరియు పిఎం ఆవాస్ యోజన క్రింద కొత్తగా రెండు కోట్ల ఇళ్ళను నిర్మించి పేదలకిస్తారు.

శ్రీమౌళిక సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని వైద్య కళాశాలలు ఏర్పాటుకు ఒక ప్రత్యేక కమిటి ఏర్పాటు చేయనున్నారు.

శ్రీపి.ఎం సూర్యోదయ యోజన క్రింద కోటి ఇళ్ళ కప్పులపై సౌర విద్యుత్తు పానెళ్లను ఏర్పాటచేసి వారి కుటుంబాలకు ప్రతినెల 300 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇవ్వనున్నారు.

శ్రీదేశీయ పర్యాటక అభివృద్ధికి లక్షద్వీప్ వంటి దీవులలో పోర్టు కనక్టివిటి, ఇన్‌ఫ్రా టూరిజం ఏర్పాటు చేస్తారు.

శ్రీదేశంలోని 9`14 సంవత్సరాల బాలికలకుగర్భాలయముఖద్వారా క్యాన్సర్ నిరోధక టీకాలు వేస్తారు.

శ్రీప్రయాణీకుల సదుపాయ నిమిత్తం మూడు ప్రధాన రంగాలకు మూడు భారీ ఆర్థిక నడవాలు (ఎకనమిక్ కారిడార్లు) ఏర్పాటు చేస్తారు. 40,000 సంప్రదాయ రైలు పెట్టెలను అధునాతన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తరహా కోచ్‌లుగా మార్పు చేస్తారు.

శ్రీమౌళిక వసతుల రంగానికి రు 11.11 లక్షల కోట్లు కేటాయించారు.

శ్రీఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్ళుగా అభివృద్ధి చేయనున్నారు.

శ్రీదేశీయంగా నూనెగింజల సాగు ప్రోత్సహించడం ద్వారా వంటనూనెల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు వ్యూహాలు రూపొందిస్తున్నారు.

శ్రీపాల ఉత్పత్తుల కోసం గిడ్డంగుల నిర్మాణం, ప్రాసెసింగ్ కోసం ఆర్థిక సహాయం అందజేస్తారు.

శ్రీజలజీవన్ మిషన్‌లో భాగంగా దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి నల్లా నీటి సౌకర్యం కలుగజేస్తారు.

శ్రీస్వయం సహాయక సంస్థ (ఎస్ హెచ్ జీ) బలోపేత లక్ష్యంగా సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి లబ్ధిదారులకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు స్థిర

(45 వ పేజీ చూడండి)

# స్త్రీలోని స్వాభిమానతకు ప్రతీక
# దేవయాని



పురాణాలను లేదా ఇతిహాసాలను పరిశీలించినప్పుడు వాటిలో పలు స్త్రీ పాత్రలు అత్యున్నత వ్యక్తిత్వానికి ప్రతీకలుగా కనిపిస్తుంటాయి. స్త్రీపాత్రలను చిత్రించడంలో మతాలు వారికి పాతివ్రత్య అంశాన్ని అంటగట్టి అదే అత్యున్నత ధర్మమని, అలాంటి స్త్రీలే ఉత్తమ స్త్రీలని ప్రచారం చేయడం కనిపిస్తుంది. కొన్ని స్త్రీ పాత్రలను వివేకహీనమైన మరబొమ్మల పాత్రలుగా, అబలలుగా, భర్తల చాటున తమ జీవితాలను ముగించుకున్న స్త్రీలుగా చిత్రించినవి కనిపిస్తుంటాయి. ఈ రెంటికి భిన్నంగా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా తమ వివేచనను, విజ్ఞతను, స్ఫురణను చూపి ఆ ప్రమాదాలను అధిగమించి ఈ నాటి స్త్రీలకు కూడా మార్గదర్శన చేయగలిగిన పాత్రలు అనేకం పురాణేతిహాసాలలో కనిపిస్తుంటాయి.

నిజానికి ఒక స్త్రీ పాత్రను వ్యక్తిగా తీసుకొని ఆ పాత్ర ఆయా సందర్భాలలో ప్రవర్తించిన విధానాలను, ఆపత్కాలంలో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలను, స్వతంత్ర ప్రతిపత్తి, వివిధ మనోవృత్తులు, లోకజ్ఞానం, కార్యదక్షత, ఆత్మాభిమానం, వారి గుణగణాలను పరిశీలిస్తే.. నేటి కాలానికే



కాదు భావితరాలకూ అనుగుణమైన సమగ్ర, సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రపంచానికే అందించడం సాధ్యపడుతుంది. అలాంటి పాత్రలలో మహాభారతంలో దేవయాని పాత్రను పరిశీలిస్తే.. సంపూర్ణ స్వాభిమానానికి నిలువెత్తు దర్పణంగా ఆమె నిలుస్తుంది.

దేవయాని రాక్షస గురువైన శుక్రాచార్యులకు, ఇంద్రుని కుమార్తెయైన జయంతికి జన్మించిన కుమార్తె.. కాలక్రమంలో కురువంశానికి చెందిన యయాతి మహారాజుకు భార్యగా మారింది. తండ్రి శుక్రాచార్యులు మృతసంజీవని విద్యను కనిపెట్టడం వల్ల, తద్వారా సాక్షాత్తూ రాక్షసరాజే శుక్రాచార్యులను సేవించడం కారణంగా అతనికి ఆ రాజ్యంలో అత్యంత గౌరవస్థానం దక్కింది. ఆ శుక్రాచార్యులకు గారాల కూతురు కావడం వల్ల ఆయన పంచప్రాణాలు ఆమెలో నిక్షిప్తం అయినట్లుగా ప్రవర్తిస్తూ ఆమె ఏది కోరినా క్షణాలపై అమర్చేవాడు తండ్రి.. దానితో సహజంగా

అమాయకురాలే అయినా ఆమెలో అభిజాత్యం అధికంగా కనిపిస్తుంది.

ఆమె ఎంతటి ఉన్నత గౌరవాన్ని పొందుతూ ఆ రాజ్యంలో జీవిస్తున్నా.. ఆమె జీవితంలో ఎదురైన ఇరువురు ముఖ్యమైన వ్యక్తుల వల్ల ఆమె జీవితం అనుకోని మలుపులు తిరిగింది. మొదటి వ్యక్తి దేవ గురువైన బృహస్పతి కుమారుడు కచుడు... రెండవది ఆ రాజు కూతురు.. తనకు అత్యంత ఇష్టమైన స్నేహితురాలయిన శర్మిష్ఠ. ఈ ఇరువురి ప్రభావమే ఆమె జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పింది.

ఆ కాలంలో దేవతలకు, దానవులకు (రాక్షసులకు) ఎక్కువగా యుద్ధాలు జరుగుతూ ఉండేవి. వృషపర్వుడనే రాక్షస రాజు గురువైన శుక్రాచార్యుల వద్ద మృతసంజీవని విద్య ఉన్నది. అది మరణించిన వారిని జీవింపచేసి, అమరత్వాన్ని ప్రసాదించే విద్య. దానివల్ల రాక్షసుల సైన్యానికి మరణం లేకపోవడం.. ఆ విద్య లేనికారణంగా దేవతల సైన్యం మరణించడం జరుగుతూ ఉండేది. దానితో వ్యధచెందిన దేవతలు, దేవతల గురువైన బృహస్పతి కుమారుడైన కచుని శుక్రాచార్యుని వద్ద శిష్యరికం చేసి మృతసంజీవనీ విద్యను ఏ విధంగానైనా సాధించాలని లక్ష్యాన్ని ఇచ్చి పంపారు. కచుడూ వెళ్ళాడు.. కచుడు శుక్రుని వద్దకు వచ్చేవరకు దేవయాని అప్పుడే యౌవన దశలోకి అడుగుపెడుతూ.. ఆయా భావనలలో.. క్రొత్తగా కనిపిస్తున్న లోకాన్ని ఆలోకిస్తూ.. ఊహా లోకంలో విహరిస్తూ ఆనందిస్తున్న యౌవనవతి. కచుడు కూడా సుకుమారుడు, నియమవ్రతుడు, మృదుమధుర ప్రియవచన పారగుడు.. గురువుగారైన శుక్రాచార్యుల మనసును గెలిచిన వాడే కాక తననూ అలరించి, ప్రసన్నతనుగా చేసుకొని, ఆనందింపచేస్తున్నవాడు. కచుని లక్ష్య సాధనలో శుక్రాచార్యుల అనుగ్రహము కంటే దేవయాని అనుగ్రహమే అధిక ప్రయోజనకారి. ఆ విషయంపై స్పష్టత కలిగిన కచుని ప్రవర్తన కూడా తదనుగుణంగా ఉండడం, ఇరువురూ సమ వయస్కులు కావడం.. స్త్రీ పురుష ఆకర్షణ.. ఇలాంటి కారణాల వల్ల సహజంగానే అతనిపై ఆమె మనసును పారేసుకున్నది. కాకపోతే ఆమె తన కోరికను అటు తండ్రికి కాని.. ఇటు కచునికి కాని వెళ్ళడించలేదు.

కచుడు దేవతల గురువైన బృహస్పతి కుమారుడని తెలిసిన రాక్షసులకు అతని రాక ఇష్టం కాలేదు. వారతనిని సంహరించే ప్రయత్నాలు పలుమార్లు చేయడం.. దేవయాని కోరికపై శుక్రుడు అతనిని తిరిగి బ్రతికించడం జరిగింది. ఒకనాడు కచుడు ఒంటరిగా అడవికి వెళ్ళిన వేళ రాక్షసులు అతనిని సంహరించి శరీరాన్ని బూడిదను చేసి దానిని మద్యంలో కలిపి శుక్రాచార్యుల చేత ఆ మద్యాన్ని త్రాగిస్తారు. సురాపానాసక్తి కలిగిన శుక్రుడు కూడా పూర్వాపరాలను గ్రహించకుండా ఆ మద్యాన్ని త్రాగాడు. కచుని రాకకై ఎదురుచూస్తున్న దేవయాని, తండ్రివద్దకు వెళ్ళి.. కచుని యోగక్షేమాలు చూడమని అతడు రాకపోతే భోజనాదులు స్వీకరించనని ఏడుస్తుంది. కూతురి బాధను చూడలేని శుక్రుడు.. దివ్యదృష్టితో చూచి కచుడు తన గర్భంలో మద్యం రూపంలో ఉన్నాడని గ్రహించి అతనికి మృతసంజీవనని విద్యను ఉపదేశించి, తన కడుపును చీల్చుకొని రమ్మని చెప్పడం, ఆ విధంగానే కచుడు

బయటకు వచ్చి తిరిగి గురువును బ్రతికించడం జరుగుతుంది.

ఇక్కడ దేవయాని మనసులో కచుని స్థానాన్ని చెప్పుకోవాలి. కచుడు తన గర్భంలో ఉన్నాడని అతడు బ్రతకాలి అంటే తాను మరణించాలని తండ్రి చెప్పినప్పుడు "ద్వౌమాం శోకౌ అగ్నికల్పౌ దహేతాం కచస్య నాశః తవచోపఘాతః" అంటుంది. అంటే కచుని మరణమూ తండ్రి మరణమూ తనను సమానంగానే బాధిస్తాయని చెప్పడం ద్వారా కచునికి తన మనసులో తండ్రితో సమానమైన స్థానాన్ని ఇచ్చినట్లుగా తెలుస్తుంది. అంతేకాదు, కచుని మరణం తన జీవితంలో సుఖం లేకుండా చేస్తుందని చెప్పడం వల్ల శుక్రుడు తనకు ప్రాణాంతకమైనా కచునికి మృతసంజీవనిని ఇచ్చి బ్రతికించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

ఇది కచునిపై దేవయానికి ఉన్న ప్రేమాభిమానాలకు నిలువెత్తు దర్పణంగా భావించాలి. తదుపరి కొంత కాలానికి కచుడు దేవలోకానికి వెళతానని శుక్రుని అనుమతిపొంది వెళ్ళే సమయంలో దేవయాని స్త్రీ సహజమైన సిగ్గు బిడియాలకు తావీయకుండా, అతనిపై తన మనసులోని ఇష్టాన్ని, అనురాగాన్నీ స్పష్టంగా తెలియచేసి, తనను భార్యగా స్వీకరించమని కోరుతుంది. దేవయాని కచుడిని భర్తగా కోరడంలో లౌకిక సంబంధమైన స్త్రీపురుష సంబంధాన్ని మాత్రమే పరిగణించిన విధానం కనిపిస్తుంది. కాకపోతే ఆమె గురుపుత్రి కాబట్టి చెల్లెలుతో సమానమని ఆమెను కచుడు తిరస్కరించడంలో ధర్మబద్ధత కనిపిస్తుంది. దానితో ఆమె కోపగించి "ఈ విద్య నీకు సిద్ధించదు" అని శపించడం, అతడూ ఆమెను బ్రాహ్మణుడు భార్యగా స్వీకరించడని శపించడం కొసమెరుపు. ఇక్కడ దేవయాని శపించడంలోని ఉద్దేశ్యం వేరు. తాను శపిస్తే కచునికి మృతసంజీవని విద్య ఉపకరించదు.. కాబట్టి మళ్ళీ దానిని సాధించే వరకు ఎక్కడకు పోతాడు.. శుక్రుని శిష్యునిగా తన వద్దనే ఉంటాడు.. ఈరోజు కాకపోతే మరోనాడయినా అతని మనసు మారదా..మారేట్లు తాను ప్రవర్తించలేదా... అదీ ఆమె ఆలోచన. కాని కచుడు తాను ధర్మమార్గానువర్తి కాబట్టి తనకు కాకపోయినా తాను నేచిన విద్యను మరొకరికి ఇచ్చి వారిద్వారా దానిని ఉపయోగిస్తానని చెపుతాడు.. తద్వారా తనకిచ్చిన శాపం వ్యర్థమయింది.. కచుని శాపం మాత్రం తనకు మిగిలిపోయింది.

దేహ సంబంధమైనది దేవయాని వాదం కాగా ధార్మిక సంబంధమైనది కచుని వాదన. అయితే ఈ సన్నివేశం మాత్రం ఆమెలోని, అమాయకతను, ప్రేమాపూర్ణ హృదయాన్ని, నిస్సంకోచంగా వ్యవహరించే స్వభావాన్ని తెలియచేస్తుంది. నిజానికి ఈ దేహ సంబంధ వాదం, ధార్మిక దృక్పథం.. ఈ రెంటి చైతన్యాల మధ్య ధర్మ సాధన లక్ష్యంగా నడవాల్సినది మానవ ప్రస్థానంగా చెపుతారు.

అయితే.. ఇక్కడ ఒక విషయాన్ని గ్రహించాలి. తన ప్రేమ విషయం తండ్రికి చెప్పి తండ్రి ద్వారా బృహస్పతిని, కచుని ఒప్పించి వివాహం చేసుకోవచ్చు. కాని ఆమె అలా చేయలేదు. కచుని బ్రతికించడంలో తనపై శుక్రునికి ఉన్న ప్రేమను ఉపయోగించుకున్నదే కాని తన వివాయ విషయంలో దానిని ఉపయోగించుకోలేదు. తండ్రిద్వారా కచుని భర్తగా స్వీకరించడం తన ఆత్మాభిమానానికి గొడ్డలిపెట్టు లాంటిదని భావించి యుండవ-

చ్చు.. అంతేకాదు, భార్యాభర్తల మధ్య ఉండాల్సింది సహజ ప్రేమ ఆకర్షణ.. అది పరస్పర అవగాహనలో రావాలే కాని మరొకరి ప్రమేయంతో రావడం వల్ల బలహీనమౌతుందనిభావించనూవచ్చు. ఈ సన్నివేశంలో ఆమె అమాయక ప్రవృత్తి, స్వతంత్ర భావనా మనస్సు, సంకోచరహితంగా తన మనసును ఆవిష్కరించుకునే విధానమూ కనిపిస్తుంది. అలాగే తన కోరిక నెరవేరనప్పుడు ప్రతీకారము తీర్చుకునే విధానమూ కనిపిస్తుంది.

మరొక్క సామాజికాంశం ఇందులో కనిపిస్తుంది. చాలా సందర్భాలలో.. మన ప్రమేయం లేకుండానే మనకు ఏ విధమైన సంబంధంలేని అంశాలలో ఎదుటి వారి రాజకీయ చదరంగంలో పాత్రలము కావచ్చు.. తదుపరి మోసపోయి బాధపడే అవకాశమూ ఉన్నది.

దేవయానికి ఆ రాజ్యపాలకుడైన వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ప్రియమైన స్నేహితురాలు. ఒకనాడు శర్మిష్ఠ మరియు మరికొందరు చెలికాండ్రతో కలసి ఉద్యాన వనంలో ఒక సరస్సులో స్నానం చేసి గట్టుపైకి వస్తున్న సమయంలో పొరపాటున శర్మిష్ఠ తన వస్త్రానికి బదులుగా దేవయాని వస్త్రాన్ని కట్టుకుంటుంది. దానితో కోపగించిన దేవయాని అంతరాలను మరచి నా వస్త్రాన్ని కట్టుకున్నావని అధిక్షేపించడం, దానికి శర్మిష్ఠ కూడా నా తండ్రి వద్ద నీ తండ్రి వంది వలె స్తోత్రం చేస్తూ చేతులు కట్టుకొని నిలుచుంటాడు.. అలాంటి వాడి కూతురివి అంటూ అహంకరించి మాట్లాడుతూ.. యాచకీ, భిక్షుకీ అంటూ దేవయానిని సంబోధిస్తుంది.దేవయాని కూడా కోపంలో శర్మిష్ఠ కట్టుకున్న వస్త్రాన్ని లాగడం, శర్మిష్ఠ దేవయానిని అక్కడే ఉన్న నూతిలోకి తోసివేసి వెళ్ళిపోవడం జరుగుతుంది. ఇరువురూ బాల్య స్నేహితులే అయినా చిన్న మాటపట్టింపు.. చిలికి చిలికి గాలివాన అయినట్లుగా మారింది.

ఇక్కడ ఒకటి ఆలోచించాలి.. అటు దేవయాని, ఇటు శర్మిష్ఠలు ఇరువురూ.. తమ అభిజాత్యాన్ని ప్రదర్శించారు. తన తండ్రి గురువైతే తానే గురువైన రీతిగా ప్రవర్తించింది..దేవయాని.. అలాగే.. తన తండి రాజయితే తానూ రాజుగా ప్రవర్తించింది, శర్మిష్ఠ. నిజానికి ఈ ఇరువురూ తమ తండ్రుల హోదాలను ఆసరాగా చేసుకొని తమ తమ శక్తి సామర్థ్యాలను అభివృద్ధిచేసుకోకపోగా, వారి అర్హతలే తమవిగా భావించి అహంకరించడం కనిపిస్తుంది. ఇది సగటు స్త్రీ మానసిక స్థితికి అద్దం పట్టగా.. ఈ ఇరువురి అహంకారం.. తదుపరి వారి జీవితాలను మరొక మలుపు త్రిప్పింది. (ఈ విధానం పురుషులకూ సహజమే)

శర్మిష్ఠ నూతిలోకి నెట్టడం వల్ల ఒకవైపు ఆక్రోషం.. మరొకవైపు.. ఆవేదనలో క్రుగ్గిపోతున్న దేవయాని ఉన్న నూతి వద్దకు.. వేటాడుతూ దాహాన్ని తీర్చుకునేందుకై వస్తాడు, యయాతి అనే మహారాజు. ఆ బావిలో దేవయానిని చూచి, ఆమెను వెలికి తీసి ఆమె వివారాలడుగుతాడు.. దాని కామె.. "యోஉసౌ దేవైర్హతాన్ దైత్యాన్, ఉత్థాపయతి విద్యయా తస్య శుక్రస్యకన్యాஉహం" అంటుంది. అంటే.. ఎవరైతే చనిపోయిన దైత్యులకు ప్రాణదానం చేస్తున్నాడో ఆ దానవ గురువైన శుక్రాచార్యుల కూతురును అంటుంది. తాను శుక్రుని కుమార్తెను అని చెప్పవచ్చు.. కాని "ఎవరైతే చనిపోయిన దైత్యులకు ప్రాణదానం చేస్తున్నాడో ఆ దానవ గురువైన శుక్రాచార్యుల కూతురును" అనడం ద్వారా తన అభిజాత్యాన్ని ప్రదర్శించడమే కాక తన తండ్రి శక్తిసామర్థ్యాలను చెప్పడమూ కనిపిస్తుంది. అంతే

కాదు, తన తండ్రి శక్తి సామర్థ్యాలు తన శక్తి సామర్థ్యాలుగా చెప్పుకోవడమూ కనిపిస్తుంది.

దేవయానిని వెతుక్కుంటూ శుక్రాచార్యులు ఆ నూతి వద్దకు వచ్చాడు.. తండ్రితో జరిగిన విషయం చెప్పి తానా రాజ్యానికి రానని మొండికేసింది దేవయాని. తపస్సంపన్నుడైన శుక్రుడు తన కర్తవ్యాన్ని తెలిసిన వాడు కాబట్టి ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేసాడే కాని ఆమె వలెనే అహంకారాన్ని చూపలేదు. ఆమె శాంతింపలేదు.. అనురాగం, నేపు, సాహసం, కలవారిని అవమానించే అవివేకుల వద్ద ఉండడం కంటే.. కష్టం మరేదైనా ఉన్నదా అంటూ తండ్రి నిర్ణయాన్ని వ్యతిరేకించింది.. చివరగా ఆమె సంతోషానికై వృషపర్వుని కొలువును వదులుకోవడానికి కూడా సిద్ధపడ్డాడు, శుక్రుడు. చారుల వల్ల ఆ విషయాన్ని తెలుసుకొని వృషపర్వుడు పరుగుపరుగున అక్కడకు వచ్చాడు. వృషపర్వుని అభ్యర్థన మేరకు శర్మిష్ఠను వేయమంది దాసీలతో సహా పరిచారికలుగా కోరి తన పంతాన్ని విడిచి ఇంటికి చేరింది, దేవయాని. శర్మిష్ఠను జీవితాంతం దాసీగా పొందిన దేవయాని తన పంతాన్ని నెగ్గించుకుంది.. శర్మిష్ఠ తన స్నేహితురాలని మరచిన దేవయాని తన తడాఖా ఏమిటో చూపింది. ఒక దెబ్బకు వేయి దెబ్బలతో ప్రతీకారం తీర్చుకున్నానని సంతోషించిందే కాని భవిష్యత్తులో తనకెదురవబోయే కష్టాన్ని తానుగా కొని తెచ్చుకున్నట్లయింది.

ఒకనాడు దాసీజనంతో జలవిహారం చేస్తున్నసమయంలో.. అడవిలో యయాతి తిరిగి కనిపించాడు.. తనను భార్యగా స్వీకరించమని అతనిని కోరింది. విలోమ వివాహం అధర్మమని అతడు వివాహానికి అంగీకరించకపోతే.. ఆనాడు తనను నూతిలో నుండి రక్షించిన వేళ తన పాణిని గ్రహించావని దానితో తమ వివాహం జరిగిపోయిందని తర్కం చెప్పింది. అంతేకాదు, తన తండ్రిని పిలిచి అతనితో ఆ వివాహం ధర్మబద్ధమే అని చెప్పించింది.

ఇక్కడ కూడా దేవయాని కచుని విషయంలో లాగానే.. తన హృదయాన్ని సమర్థించుకున్నది. తన ఇష్టాయిష్టాలే ప్రధానంగా భావించింది. ధర్మాధర్మ విచికిత్సకు ఆమె వద్ద స్థానం లేదు. యయాతితో వివాహ సందర్భంలో శర్మిష్ఠను కూడా తనతో దాసిగా పంపుతూ యయాతితో శుక్రుడు... ఈమె రాజకన్య.. కాబట్టి ఈమెకు సకల సౌకర్యాలు కల్పించాలని కాకపోతే ఆమెతో కలిసి శయనించకూడదని నియమం పెడుతూ.. పంపించాడు.

దేవయాని ఇక్కడ స్వార్థపరురాలైన స్త్రీగా కనిపిస్తుంది. తన సుఖం, ఆనందం ముందు పితృభక్తి, రాజభక్తి, స్నేహశీలత.. ఇవేవీ పనిచేయలేదు. నిజానికి దాంపత్య మనేది భారతీయ సంప్రదాయంలో అద్వైత ప్రణయ సిద్ధికి మార్గం చూపాలి. అంతిమ ఫలితమూ కావాలి. కాని అహంకారాలకు, అంతర్సంఘర్షణలకు స్థానం కారాదనే ప్రాథమిక సూత్రాన్ని మరచింది దేవయాని. సాంసారిక జీవనంలో యయాతి దేనిని పొందాలనుకున్నాడో దానిని అందించడంలో ఆమె విఫలురాలయింది. సంతానం కలిగినా వారి బంధంలో ఆప్యాయతలు అంతగా బలపడలేదు.

ఒకనాడు అసమాన్య సౌందర్యరాశియైన శర్మిష్ఠ యయాతిని దర్శించి తనకు సంతానాన్ని ప్రసాదించమని కోరింది.. అతనిని ఒప్పించింది. ఫలితంగా ముగ్గురు కుమారులు జన్మించారు. దేవయాని అమాయకత్వం

ఆమెనే మోసగించినట్లయింది. శర్మిష్ఠ కుమారులను చూచి సత్యాన్ని తెలుసుకొని కోపంతో తండ్రి చెంతకు చేరింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాన్ని వారే పరిష్కరించుకోవాలి కాని ఇతరుల ప్రమేయాన్ని కోరకూడదనే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయింది. మితిమీరిన అభిజాత్యం వల్ల తన సంసారాన్ని తానే విఛ్ఛిన్నం చేసుకునేందుకు బీజం వేసుకున్నది. కూతురు బాధను భరించలేని శుక్రుడు.. విజ్ఞతను మరచి యౌవన మదంతో చేసిన నియమాన్ని మరచి శర్మిష్ఠతో సంతానాన్ని కన్నావు కనుక వార్ధక్యం పొందమని అల్లుడిని శపించాడు. దీని వల్ల ఎవరికి నష్టమో ఆలోచనలేదు. చివరగా యయాతి ప్రార్థనకు కరిగిన శుక్రుడు యయాతికి శాప నివారణను సూచించాడు. తన వార్ధక్యాన్ని ఎవరైనా తీసుకొని వారి యౌవనాన్ని ఇస్తే ఆ శాపం వర్తించదని చెపుతాడు..

శర్మిష్ఠ కనిష్ట కుమారుడైన పూరుడు అనబడే వాడు యయాతి వార్ధక్యాన్ని తీసుకునేందుకు అంగీకరించడం.. కాలాంతరంలో అతనే చక్రవర్తిగా నియమితుడు కావడం ముగింపు.



దేవయాని ధర్మము తెలిసినదే కాని అభిజాత్యం ఆమెను తప్పుడు నిర్ణయాలు తీసుకునేందుకు ప్రోత్సహించింది. అమాయకత్వంతో.. అహంకారంతో శర్మిష్ఠను దాసిగా చేసుకున్నదే కాని ఆమె తనకు సవతిగా నిలుస్తుందని గ్రహించలేకపోయింది. స్వార్థం తప్ప పరార్థాన్ని గ్రహించలేని దేవయాని మనస్సు గార్హస్థ్య ధర్మాన్ని నిలుపలేకపోయింది. అజరామరమైన ధర్మాన్ని నిలుపడం కోసం అవసరమైతే భౌతిక సుఖాలకు దూరం కావాలనే సామాన్య సూత్రాన్ని మరవడం వల్ల భర్తకు తండ్రి ఇచ్చిన శాపం నేపథ్యంలో రెంటికీ చెడ్డ రేవడిగా మారింది.

నిజానికి ఆమె జీవితం మొత్తం దేవతల చేత నడిపించబడిందా అని అనుమానం వస్తుంది. రెండు ప్రధానమైన సన్నివేశాలలోనూ ఆమె ప్రమేయం లేకుండా ఆమె ఆ చటంలో బిగించబడింది. కచుడు తన లక్ష్య సాధనలో ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవడంలో కృతకృత్యుడయ్యాడు. రెండవ సందర్భంలో వాయు రూపంలో శర్మిష్ఠ దేవయాని వస్త్రాలను కలిపి దేవతలు వారి ప్రయోజనాన్ని నెరవేచుకున్నారనిపిస్తుంది. అలాగే శర్మిష్ఠ తన స్నేహితురాలైనా ఆమెను అవమానించే ప్రయత్నం చేసి ఆ వలయంలో తానే చిక్కుపడడం కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే దేవయాని సార్థక నామధేయురాలు అనిపిస్తుంది. దేవతల చేత నడిపించబడింది.. దేవయాని ప్రవర్తన వల్ల ఆమెకు మంచిజరిగిందా చెడు జరిగిందా అనేదానికన్నా అమె స్వాభిమానం, అభిజాత్యం, అహంకారం, అమాయకత, తొందరపాటు, సహనం లేకపోవడం వల్ల ఆమె జీవితం రసహీనమైందనేది సత్యం.

ఈనాటి సమాజం ఆమె నుండి ఎలాంటి సందేశాన్ని తీసుకోవాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

పాలకుర్తి రామమూర్తి

# ప్రసీద మమ భాస్కరా!

వి.నిర్మల



రథసప్తమి సూర్యుని పండుగ. ఆయన తేజోమయుడు. రక్త వర్ణంలో శోభిల్లే ఎనిమిది వేల ప్రకాశవంతమైన కిరణాలతో ప్ర-కాశిస్తుంటాడు. తన కిరణాలతో నీటిని తాగి మేఘాల రూపంలో వర్షింపజేస్తుంటాడు. భక్తులకు సూర్యుడు ప్రత్యక్ష దైవం. చైతన్య ఆరోగ్య ప్రదాత. సూర్యుడు లేనిదే ఈ జగత్తు లేదు. సూర్యకిరణాలు ఎన్నున్నాయో, సూర్యతత్వ రహ-స్యాలు, సూక్ష్మాలు అన్ని ఉన్నా-యని అనిపిస్తుంది. నేటి మన వైవస్వత మన్వంతర ప్రారంభం కూడా రథసప్తమి నాడే. చావు పు-ట్టుకలతో ప్రత్యక్ష సంబంధము-న్న సూర్యుని గురించి వేదాలు పేర్కొన్న దానినే నేటి వైజ్ఞానిక పరిశోధనలు ధ్రువీకరిస్తున్నాయి. ఆయన ప్రతినిత్యం కనిపిస్తాడు. ప్రతి ప్రాణికి జీవత్వాన్ని, జీవితా-న్ని అందిస్తాడు. అలుపే ఎరగని అవిశ్రాంత యోధునిగా తూర్పు నుంచి పడమరకు అనవతరం సంచరిస్తూ లోకబాంధువునిగా కీ-ర్తినందుకుంటున్న ప్రత్యక్ష నారా-యణుడు ` సూర్య భగవానుడు.

విజ్ఞానపరంగా చూస్తే సూ-ర్యుడొక నక్షత్రం. ఆ నక్షత్రం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ కొన్ని గ్రహాలు, వాటిలో ఒకటి భూమి. ఆ భూమికీ, సూర్యుడికీ మధ్యన గల దూరం చాలా కీలకమయి-నది. ఇంతకంటే దగ్గరగా ఉన్న గ్రహాలు బూడిద మైదానాలు. దూరంగా ఉండేవన్నీ మంచుతో కప్పుకుపోయినవి. ఈ భూమి మీద మాత్రమే నీరుంది. అది కూడా మంచు, నీరు, ఆవిరి అనే మూడు రూపాలలోనూ ఉంది. నీరే ప్రాణి పుట్టుకకు ఆధారమ-యింది. నీరే మనిషి మనుగడకు ఆధారమైంది. సూర్యుడు జీవనా-ధారమైన పరమాత్ముడు. సమస్త జీవులకు సూర్యుడు అన్నదాత. సూర్యరశ్మిని వాడుకుని మొక్కలు పిండి పదార్థాన్ని తయారు-చేస్తాయి. తాము పెరుగుతా-యి. ఆ మొక్కలను తిని కొన్ని రకాల జంతువులు బ్రతుకు-

తాయి. మొక్కలను, జంతువులను తిని మరికొన్ని ప్రాణులు మనుగడ సాగిస్తాయి. వీటిన్నింటినీ తిని మనిషి బతుకుతాడు. సూర్యుడు లేకుంటే తిండి లేదు. నేడు మనం అనుభవిస్తున్న ఇంధనశక్తికి సూర్యుడే ఆధారం. సూర్యుని వల్లనే వర్షాలూ, నీరు అందుతాయి. వీటన్నిటి ఆధారంగా విద్యుత్తు తయారవుతుంది. మరోసారి నేరుగా సూర్యుని వెలుగును వాడుకుని సౌరశక్తి పుడుతుంది. అన్ని ఇంధనాలకు సూర్యుడే.

ఒక సూర్యుడు సమస్త జీవులకు మూలం అన్నట్లు సమస్త ప్రపంచానికి ఒకడే సూర్యుడు. భిన్న భిన్న దేశాలకు, భిన్న భిన్న జాతులకు, భిన్న భిన్న మతాలకు విభిన్నమయిన దేవుళ్ళు ఉండవచ్చు. కానీ అందరూ ముక్తకంఠంతో దేవుడిగా భావించదగిన ఏకైక దైవం సూర్య భగవానుడే. ఆయన అగోచరుడు కాదు ప్రత్యక్ష దేవత. ప్రాతః కాలాన ఆయన తన ఉషః కిరణాలతో మనల్ని అలరించినా, మిట్టమధ్యాహ్న తాపంతో తపింపజేసినా, మొత్తం మీద మన మనుగడకు కారణ భూతుడయిన చల్లని దేవుడు సూర్యుడు. మనమెరిగిన మన దర్శించుకునే సృష్టికర్త భర్త అన్నీ ఆయనే.

సూర్యారాధన ఒక్క భారతదేశానికే పరిమితమయింది కాదు. ఈజిప్టియనులు, బాబిలోనియనులు, పర్షియావారు సూర్యారాధకులు. గ్రీసు దేశంలో పూజింపబడిన హీలియస్, అపోలోలు సూర్యుని ప్రతిరూపాలే. హీలియాస్ తన బంగారు రథంలో తిరుగుతూ అటు దేవతలకు, ఇటు మానవులకు వెలుగు ప్రసాదిస్తాడని నమ్మారు.

హిందూమతంలో పరమేశ్వరుణ్ణి ఎవరైనా వారి ఇష్ట స్వరూపంలో ఆరాధించేందుకు అవకాశం ఉంది. అలాంటి మార్గాల్లో ప్రధానంగా ఆరు మతాలు వేదంలో ప్రస్తావనకు వచ్చాయి. పరమేశ్వరుణ్ణి శివునిగా ఆరాధిస్తే శైవమతం అవుతుంది. విష్ణువుగా ఆరాధిస్తే వైష్ణవం అవుతుంది. శక్తిగా ఆరాధిస్తే శాక్తేయం. గణపతిగా ఆరాధిస్తే గాణపత్యం. సుబ్రహ్మణ్యునిగా ఆరాధిస్తే స్కాందులు అంటారు. ఇక సూర్యుణ్ణి ఆరాధించేవారు సౌర మతానికి చెందిన వారవుతారు.

సూర్యుని మాత్రమే దేవునిగా పూజించే సంప్రదాయం మనదేశంలో ఒరిస్సాలో మాత్రమే మిగిలింది. మిగతా దేశంలో సంక్రాంతికి మాత్రమే సూర్యారాధన జరుగుతుంది. కానీ సంధ్యావందనం, అర్ఘ్యప్రదానాలు, గాయత్రి, సావిత్రి ద్వారా సూర్యునికి మాత్రమే చేరుకుంటాయి. సంధ్యా సమయంలో సంధ్యా వందనం చేయడం, గాయత్రీ జపం చేయడం, భారతీయ సంప్రదాయం. ఇది ఏ కోరికలు లేని వందనం. ఆచమనం, సంకల్పం, ప్రాణాయామాదికాల తర్వాత, అంగన్యాస, కరన్యాసాలు చేస్తారు. వీటి తర్వాత ఉపస్థానం, మంత్ర జపం ఉంటాయి. సవిత్యదేవుని వరేణ్య రూపాన్ని ప్రార్థిస్తూ, ఈ బుద్ధికి జ్ఞానాన్ని ప్రసాదించు. మాకు రక్షకుడిగా ఉండు. నీ దివ్య తేజస్సు మాకు మార్గదర్శమగుగాక అనే భావాలను మననం చేయడమే గాయత్రీ జపం. అర్ఘ్యప్రదానం కూడా సూర్యునికి చెందుతుంది. ఎవరికైనా అనారోగ్యం సోకితే సూర్య నమస్కారాలు చేస్తారు. ఇలా నమస్కారాలు చేసే సమయంలో సౌరాన్ని అనుసంధానిస్తూ ఒక్కో భంగిమలో ఒక్కో విధంగా నమస్కారం చేస్తారు. అలాగే అరుణ పారాయణం చేయించి తీర్థాన్ని సేవిస్తారు.

"ఆరోగ్యం భాస్కరాచ్ఛేత్" శ్రీ మహావిష్ణువు వేదాలు సృష్టించి

బ్రహ్మదేవుడికిచ్చి వాటి ప్రకారం సృష్టి చేయమన్నాడు. బ్రహ్మ ఆ వేదాలను సూర్యుడికి నేర్పాడు. సూర్యుడు వేదాలను సంహితులుగా, మంత్రాలుగా విభజించి శిష్యులకు నేర్పాడు. శిష్యులు వర్గాలుగా విభజించి ఋషులకు నేర్పారు. వాటిలో ఒకటి ఆయుర్వేదం ఒక్క మానవాళికే కాదు సమస్త ప్రాణులకు సూర్యుడు వల్లనే ఆయుష్షు, ఆరోగ్యం లభిస్తున్నాయి. అందుకే "ఆరోగ్యం భాస్కరాచ్ఛేత్" అన్నారు. మంచి ఆరోగ్యం, పరిపుష్టి, తేజస్సు లభించాలంటే సూర్యారాధన చేయాలని పెద్దలు చెబుతారు.

సూర్యుని కుటుంబం: కశ్య ప్రజాపతి, అదితి సూర్యుని తల్లిదండ్రులుగా వర్ణింపబడ్డారు. విశ్వకర్మ కూతురు సంజ్ఞ. ఆమె అమిత సౌందర్యవతి. ఆమెను ప్రేమించాడు. ఆమె కూడా సూర్యున్ని వలచింది. ఇరువురికి వివాహం జరిగింది. వైవస్వతుడు, యముడు అనే ఇరువురు కుమారులు, యమున అనే కూతురు కలిగారు. క్రమంగా సూర్యుడు వేడి ఎక్కువవుతూ వచ్చింది. సంజ్ఞ అంతటి తాపాన్ని భరించలేకపోయింది. తన నీడ తనలాగే ఉండటం చూసి, నీడకు ప్రాణం పోసి, 'ఛాయ' అని పేరు పెట్టి తన బదులు తన భర్తతో కాపురం చేయమని పంపించింది. నా బిడ్డలను నీ బిడ్డలుగా చూసుకోవాలని కూడా చెప్పింది.

సంజ్ఞ పుట్టింటికి వెళ్ళింది. చాలాకాలం గడిచింది. అల్లుడెన్నాళ్ళకూ వచ్చి పిల్లను తీసుకువెళ్లకపోవడం చూసి విశ్వకర్మ కుమార్తెను మందలించాడు. గత్యంతరం లేక సంజ్ఞ మళ్ళీ భర్త వద్దకు బయలుదేరింది. కానీ మళ్ళీ తన భర్త తీవ్రత గుర్తొచ్చి, భయపడి ఒక అడవికి చేరి ఆడ గుర్రంగా మారి తపస్సు చేసుకుంటూ ఉండిపోయింది. సూర్యుడికి, ఛాయకు సావర్ణి, శని అనే కుమారులిరువురు, తపతి అనే కూతురు కలిగారు. తనకు సంతానం కలిగినప్పటినుంచి ఛాయ మనసు మారిపోయి సంజ్ఞ సంతానాన్ని సవితి పిల్లలుగానే చూడ సాగింది. కొన్నాళ్ళకు సూర్యుడికి అసలు నిజం తెలిసింది. సంజ్ఞను వెతుక్కుంటూ వెళ్ళి ఆమె ఉన్న అడవికి చేరుకున్నాడు. తాను కూడా గుర్రం రూపం ధరించాడు. వారికి పుట్టిన బిడ్డలే అశ్వినీ దేవతలు.

సూర్యుడు అంతర్థానంతో లోకాలు తల్లడిల్లాయి. తిరిగి సూర్యుడు స్వస్థానానికి వెళ్లక తప్పలేదు. ఈ లోపున విశ్వకర్మకు కూడా అసలు సంగతి తెలిసింది. సూర్యుడు వేడి తగ్గించడానికి ఆయనను సాన పట్టారు.అందువల్లనే సూర్యుడికి తరణి అని పేరు వచ్చింది.

పరబ్రహ్మ స్వరూపం: సకల జీవరాశులకు చైతన్యాన్ని కలిగించేవాడు సూర్యుడు. అటువంటి సూర్యభగవానుడు పరబ్రహ్మస్వరూపుడేనని బ్రహ్మపురాణం చెబుతుంది. సూర్యుడు లేనిదే ఈజగత్తు లేదు. సూర్యుడిని "ద్వాదశాత్మ"గా పిలుస్తుంటాం. అంటే మనకు ఉండే పన్నెండు నెలల్లో సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో పేరుతో వెలుగొందుతూ కాలచక్రాన్ని నడిపిస్తూ ఉన్నాడు. కనుక "ద్వాదశాత్మ" అయ్యాడు. పన్నెండు నెలల్లో సూర్యుడు పన్నెండు రూపాలలో, పన్నెండు పేర్లతో, తన పరివార జనంతో పరిభ్రమిస్తుంటాడు.

దాతా మిత్రో`ర్యమాశక్రో వరణస్త్వంశ, ఏవచ భగో వివస్వాన్ పూషాచ సవితా దశమస్తథా ఏకాదశ స్తథా త్వష్టా ద్వాదశో విష్ణురుచ్యతే, జఘన్య జస్తు సర్వేషామాదిత్యానాం గణాధిక:॥

అనగా 1.దాత 2.మిత్రుడు 3.ఆర్యముడు 4.శక్రుడు 5.వరుణుడు 6.అంశుడు 7.భగుడు 8.వి-

వస్వంతుడు 9.పూషుడు 10.సవిత 11.త్వష్ట 12.విష్ణువు. వీరిలో సూర్యుడు అనే పేరు లేనేలేదు. కానీ మనకు ద్వాదశాదిత్యులు అంటే పన్నెండు మంది సూర్యులు అని భావం. ఈ విధంగా 12 మాసాలలోను, 12 పేర్లతో సూర్యుడు లోకపాలన చేస్తుంటాడు. ప్రతి మాసంలోనూ గంధర్వుడు, సర్పం, అప్సరస, యక్షుడు, ఋషి, రాక్షసుడు అనే ఆరుగురితో కలిసి ఉంటాడు. ఋషులు సూర్యునికిష్టమైన వేదాన్ని పఠిస్తుంటారు. గంధర్వులు గానం చేస్తుంటారు. అప్సరసలు నృత్యం చేస్తుంటారు. యక్షులు రథాన్ని అలంకరిస్తుంటారు. రాక్షసులు వెనక నుండి రథాన్ని ముందుకు తోస్తుంటారు.

సూర్యుడిని కొందరు ఋషులు సవిత్వరూపినిగా వర్ణించారు. విశ్వామిత్రుడు కనిపెట్టిన గాయత్రీ ఛందం సవిత్వ దేవలోకమే. సవిత్వరూపమైన సూర్య తేజస్సునకు పరబ్రహ్మాత్మక తేజస్సుగానే అర్థం చెప్పారు. ఋగ్వేదంలోని ఉషోదయ వర్ణనలు అద్భుత కవితాత్మకాలు. పాశ్చాత్యులను కూడా పరవశింపజేసిన వర్ణనలవి.

సూర్యుడిది బంగారు రథం: దానికి ఒకటే చక్రం. ఆ చక్రానికి ఆరు ఆకులు. రథానికి ఏడు గుర్రాలు. చక్రం సంవత్సరానికి ప్రతీక.ఆకులు ఆరు ఋతువులు, ఏడు గుర్రాలు ఏడుకిరణాలు. సూర్యుడు కాలానికి కర్త. ఆ విషయాన్ని ప్రాచీనులు ఇలా ప్రతికాత్మకంగాను, కథల రూపంలోనూ బోధించారు. అయితే ప్రాచీన గ్రంథం 'అరుణం' ప్రకారం సూర్యునికి ఒకే అశ్వము ఉండేదని, సూర్యునికి గమనం ఒకటేనని, దాని సంజ్ఞా నామవచకం సప్త. సప్త అనే పేరు గల అశ్వం ఒకటేనంటుంది. 'సప్త నామం అశ్వః ఏకఏవ' అంతేగాని ఏడు గుర్రాలు కావు అని చెప్తుంది అరుణం. సూర్యకిరణాలు ఏడేమీ ఖర్మ! మన మాంస నేత్రాలకు కనపడేవి మాత్రమే ఏడు. అతినీలలోహితాది కిరణాలు అర్బుజం లెక్కించడానికి వీలు కాకుండా ఉంటాయి. రథం అంటే మన కంటికి కనపడే సూర్య గోళమే. సూర్యదేవతా చైతన్యానికి రథం ` శరీరం. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు" అని శరీరాన్ని రథమంటుంది కఠోపనిషత్తు. రథమెక్కి మేరు పర్వతం చుట్టూ తిరుగుతూ ఉంటాడు. సూర్యుడి కిరణాలు రోగనాశకాలు. అందులోనూ సూర్యుని మొదటి ఏడుకిరణాలకు మరింత మహిమ ఉంటుందట. వాటి పేర్లు సుషుమ్నం, హరికేశ, విశ్వకర్మ, విశ్వచ్యశ, సంపద్వసు, అర్వాదము, స్వరాడ్వసు పేర్లను స్నానంతరం జపించి సూర్య నారాయణునికి నమస్కారం చేయాలి.

మన దేవతారాధన ఎప్పుడూ సూర్యునితో ప్రారంభం కావాలి. తరువాత అంతరంలో (హృదయంలో) భగవంతుణ్ణి అన్వయించుకోవాలి. ఆదిత్య హృదయంలో ఈ క్రమమే మనకు కనిపిస్తుంది. అనేక ఉపనిషత్తుల్లో అంతరాదిత్యోపాసన అనేది కనిపిస్తుంది. ఈ అంతరాదిత్యా మండలంలో బంగారు రంగు కలిగిన పురుషుడు ఉన్నాడని తెలుస్తుంది. ఈ రకంగా సూర్యోపాసన నేటికీ ఉంది. ఉపాసన చేయలేని వారికి అతి సులభమైన సూర్య మంత్రాలు, ఆదిత్య హృదయం వంటి వాటిని కూడా మన ఋషులు తెలియజేశారు. మన సంస్కృతిలో సౌరమే తొలి మతం అన్నది కాదనలేని సత్యం. సృష్టిలయలు సూర్యుని వల్లనే జరుగుతున్నాయని సూర్యోపనిషత్తు సూచించింది. జీవులలో చైతన్యం నింపడం ద్వారా పోషక బాధ్యతలు నిర్వహిస్తున్నాడు సూర్యనారాయణుడు. సూర్యరశ్మి నుంచి పోషకాలు, విటమిన్లు

లభిస్తాయని ఆధునిక విజ్ఞానం కూడా చెబుతుంది. సూర్యునిలోని ఉన్నంత రోగ నిరోధక శక్తి, ఔషధ తత్వం మరి ఎక్కడా లేదు. కృష్ణ యజుర్వేదం, తైత్తరీయ అరణ్యకంలో సూర్య నమస్కార ప్రక్రియ విశేషమైనదని ఆధునిక శాస్త్ర విజ్ఞానం కూడా అంగీకరించింది. శ్రీరాముడు రావణునితో యుద్ధానికి సమాయాత్తమయ్యే ముందు అగస్త్య మహాముని ఉపదేశించిన ఆదిత్య హృదయాన్ని పఠించాడు. యుద్ధంలో రావణున్ని సంహరించాడు. మయురుడనే మహాకవి హర్ష చక్రవర్తి ఆస్థానంలో (క్రీ.శ. ఏడోశతాబ్దం) ఉండేవాడు. సూర్యోపాసన చేసి తనకు శాపవచనంగా కలిగిన కుష్టు వ్యాధిని నివారించుకున్నాడని చెబుతారు.

సూర్య శతకంలో వందో శ్లోకం ప్రకారం `సూర్యుడు అనే దేవుడు మనకు ఆత్మబంధువే కాదు, ఆప్త మిత్రుడే కాదు, ఆచార్యుడే కాదు, ప్రభువే కాదు, రక్ష చక్షువే కాదు, దీపమే కాదు, గురువే కాదు, తండ్రి మాత్రమే కాదు, జీవనం మాత్రమే కాదు, జగత్కారణం మాత్రమే కాదు, వీటన్నింటినీ మించిన వాడు. మనతో పలానా సంబంధం కలవాడు మాత్రమే అని చెప్పటానికి వీలు లేని వాడు అని శ్లోక తాత్పర్యం. సూర్యుడు భక్తుల అభీష్టాలను తీర్చే కరుణామయుడు. ఆయన కృప వల్ల:

`శ్రీకృష్ణుని పుత్రుడైన సాంబునికి దుర్వాస మహాముని శాపంతో కుష్టు వ్యాధి సోకింది. సాంబుడు భక్తితో సూర్యోపాసన చేయడం వల్ల నివారణ అయింది.

`ప్రవరాఖ్యుడు సూర్యోపాసనతో తన చర్మవ్యాధిని నుండి స్వస్థతను పొందాడు.

`కర్ణుడు, సత్రాజిత్తు వంటి వారెందరో సూర్యుణ్ణి ఉపాసించి ధన్యులయ్యారు.

`యాజ్ఞవల్క్యుడు సూర్యోపాసన చేసి శుక్ల యజుర్వేదాన్ని వెలుగులోకి తెచ్చాడంటారు.

`హనుమంతుడికి, యజ్ఞవల్క్యుడికీ వేద శాస్త్రాలు నేర్పినవాడు సూర్యుడు. ఆంజనేయుడు సూర్యుని శిష్యుడై నవ్య వ్యాకరణ పండితుడయ్యాడు.

`వనవాసంలో ఉన్న ధర్మరాజు ప్రార్థించగా ఎన్నటికీ నిండుకొనని అక్షయపాత్రనిచ్చి ఆదరించిన వాడు సూర్యుడు.

`జగత్సాక్షి అయిన ఆ సూర్య భగవానుని గురించి వేనవేల విశేషాలు, వింతలు. సౌర పురాణం ఎంత ముచ్చటించుకున్నా తనివి తీరనిది. అది అనంతం, అజరామరం.

వినాయకుడు నివేదన ప్రియుడు. శివుడు అభిషేక ప్రియుడు. శక్తి స్తోత్ర ప్రియ. విష్ణు అలంకార ప్రియుడు. సూర్యుడు నమస్కార ప్రియుడు. భక్తితో వినయ విధేయతలతో సూర్యున్ని నమస్కరిస్తే ఆయన దయ మనపై ప్రసరిస్తుంది. ఆరోగ్యంతో ఆనందంగా జీవించగలుగుతాం. త్రిమూర్తుల ఏకీకృత స్వరూపమే భాస్కరుడు. ఉదయం బ్రహ్మగా, మధ్యాహ్నం శివుడుగా, సాయంత్రం విష్ణువుగా ప్రభాకరుడు ప్రకటితమవుతున్నాడు. అందుకే ఆదిత్యుణ్ణి స్త్రీ పురుష మూర్తిగా కీర్తిస్తారు.

రథసప్తమి నాడు ఏమి చేయాలి:

రథసప్తమి మాఘమాసంలో సాధారణంగా వస్తుంది. ఈ సారి సూర్య జయంతి శుక్రవారం ఫిబ్రవరి 16, 2024న వస్తుంది. ఆనాడు సూర్యోదయానికి ముందు సుమారుగా 25 నిమిషాల ముందు అరుణోదయ వేళలో సూర్యునికి ఇష్టమైన జిల్లేడు ఆకులు, రేగి పండు శిరస్సుపై ఉంచుకొని వాటి మీద నుంచి నీళ్లు పోసుకుని శిరస్నానం చేయాలి. తరువాత సూర్యునికి నమస్కరించాలి. ఆదిత్య హృదయం, ఇతర సూర్య స్తోత్రాలు పఠించాలి.

ఆనాడు తులసికోట వద్ద శుద్ధి

చేయాలి. పసుపు కుంకుమలతో అలంకరించి ముగ్గుల మీద గొబ్బి పిడకలను కుంపటిగా అమర్చాలి. దానిపై కొత్త గిన్నెలో ఆవు పాలు పొంగలి వండాలి. ఆ క్రమంలో పాలను మూడుసార్లు పొంగనివ్వాలి. పొంగలి వండిన తర్వాత చిక్కుడుకాయలతో రథాన్ని తయారు చేసుకోవాలి. కొత్త చీపురు పుల్లల సహాయంతో చిక్కుడుకాయలను రథాకారంలో గుచ్చాలి. తులసి కోట ముందు వేసిన ముగ్గుపై ఉంచాలి. ఆ రథం మీదకు సూర్యదేవుని ఆవాహన చేయాలి. రథం ముందు పదిహేను చిక్కుడు ఆకులు పరచి వాటిలో ఇంతకుముందు వండిన పొంగలి పెట్టాలి. వీటిలో ఐదు ఆకులు అగ్నిదేవునికి, ఐదు ఆకులు తులసి మాతకు, ఐదు ఆకులు సూర్య భగవానునికి నివేదన చేయాలి.

సమంత్రకంగా షోడశ ఉపచారాలతో ఆదిత్యునికి అర్చనలు చేయాలి. రథసప్తమి నాడు చేసే పూజల్లో అనేక ప్రాంత, ఆచార భేదాలు కనిపిస్తాయి. కొందరు ఏడు, తొమ్మిది ఆకుల్లో నివేదన పెడతారు. నివేదన చేసిన ప్రసాదాన్ని భక్తులు సేవిస్తే మధురాతి మధురంగా ఉంటుంది.

రథసప్తమీ వ్రతం వల్ల శారీరక రోగాలతో పాటు ఏడు జన్మల పాపం నశిస్తుంది. ఈ వ్రత ఫలితంగా శారీరక, ఆధ్యాత్మిక తేజస్సు కలుగుతుంది. రథసప్తమి, ఆదివారం కలిసి వస్తే అది మరింత విశేష ఫలితాలను కలిగిస్తుందని ఆరోజు చేసే అర్చన ఫలితంగా అపమృత్యు భయం తొలగుతుంది. జిల్లేడు ఆకులు, బదిలీ ఫలాలు, గరికపోచలు, చందనంతో కలిసిన అక్షతలు తీసుకొని సమంత్రకంగా సూర్య భగవానుడికి అర్ఘ్యం ఇవ్వాలి. ఆ తర్వాత నువ్వుల పిండితో చేసిన అప్పాలు నివేదన చేయాలి.

ఈ మాఘమాసంలో ద్వాపర యుగం ప్రారంభమైందని పురాణాలు చెబుతున్నాయి. త్రేతాయుగంలో రామసేతు నిర్మాణం మొదలయింది. మరియూ సరస్వతి దేవి జన్మించినది. ఈ పవిత్ర మాసంలో ఏ ఒక్క రోజైనా త్రివేణి సంఘమ స్థానంలో ఆచరించే స్నానం కోటి పుణ్య స్నానాలతో సమానం.

రథసప్తమి పండుగ పురస్కరించుకొని తిరుమలలోని మలయప్ప స్వామి ఒకే రోజున ఏడు వాహనాలపై ఊరేగి భక్తులకు కనువిందు చేస్తాడు. ఈ విధంగా శ్రీవారు ఉత్సవ మూర్తిగా దర్శనమివ్వడం అర్ధబ్రహోత్సవం అని పిలుస్తారు. లక్షలాది భక్తులు ఈ అర్ధబ్రహ్మోత్సవంలో పాల్గొనడం ఒక విశేషం.

రథసప్తమి పురస్కరించుకొని భక్తులు వేలసంఖ్యలో అరసవెల్లి శ్రీ సూర్య దేవాలయంలో ప్రవేశించి స్వామివారి నిజరూపం దర్శించి ధన్యులవుతారు. నందికొట్కూర్, తిరుచానూర్, గొల్లల మామిడాడ, సికింద్రాబాద్` తిరుమలగిరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. సూర్య భగవానుడు ప్రతి ఆలయంలో నవగ్రహ మండపంలో కొలువుదీరి ఉంటాడు.

ఒకటే వెలుగై, రెండు కళ్ళకు చూపునిస్తూ, మూడు జగత్తులలో నిండి, నాలుగు ముఖాలు కల బ్రహ్మతో స్తుతింపబడుతూ, ఐదు భూతాలలో వ్యాపించి, ఆరు ఋతువులను కలిగిస్తూ, ఏడుగురు ఋషులతో పొగడ్తలందుకుంటూ, ఎనిమిది దిక్కులను, తొమ్మిది(నవ) కాంతులతో వెలుగొందే సూర్యుని సహస్ర కిరణాలు మీకు శుభం కలిగించు గాక!

**ఆదిత్యాయ నమో నమః**

# సతీదేవితో శివుని వివాహం..

పాలకుర్తి ఉమాదేవి

శ్రీకర మోహనాకృతిని చెన్ను వహించు నిజాత్మజన్ "సతీ"
ప్రాకట నామ భూషిత, శుభంకరి, నీశ్వరి, సర్వమంగళన్
శ్రీకరు డైన శంకరుని చిన్మయ రూపుని కిచ్చి చేసె సు
శ్లోకుడు దక్షు డుద్వహము, శోభన మాకథ నాలకింతమా! 1

ఆ మహిత శుభవేళ ఆది విష్ణువే వరుడైన శంకరుని అలంకరించాడట...

వ్రాత్యుండు తానౌట పరమేశు కెవ్వరు
  సంస్కారములు మున్ను సలుప కునికి
ధూళి ధూసరితమై దొరలు దేహంబును
  పన్నీటి స్నాన సంప్రతతి గూర్చి
జడలు గట్టిన జుట్టు జటలు తీరిచి దిద్ది
  మైబూది తుడిచేసి మహిత గతుల
సౌగంధ్య మొప్పారు చందనాదు లలది
  చర్మ వస్త్రము దీసి చక్కనైన

పట్టు వస్త్రమ్ములిచ్చి, శోభాయమాన
మైన భవ్య శిరస్త్రాణమంత చుట్టి
యెడద నలరారు రుద్రాక్ష లేటి కనుచు
అద్భుతంబైన విరిమాల లమర వేసి! 2

హరుని ఫణి హారముల డుల్చి నవని గలుగు
సుమణి హార వితానమ్ము నమిత భక్తి
దాల్చగా జేయ శంభుండు ధర్మ రతుడు
అమల కాంతుల రోచిష్ణు డయ్యె నపుడు! 3

అలా శ్రీహరిచే త్రోసి వేయ బడ్డ భూషణాలు శంకరుని చేరి ఇలా ప్రార్థించాయట...

ఆది నుండియు భక్తి నిన్నాశ్రయించి
బ్రతుకు మమ్ముల దయ మాలి పారద్రోయ
పాడి గాదంచు రోదింప భవుని ప్రోల
అభయ మిడె భూషణాళికి నభవు, డంత! 4

కన్యా దాత యైన దక్షుడు సకల సంభారములను సమకూర్చుకొని...

బంధు గణంబులు భార్యయు తోడురా
 వేద ఘోష సలుప విబుధ గణము
మంగళ ధ్వనులతో మార్మోగ దిక్కులు
 స్వస్తి వాక్యంబులు పలుక ఋషులు
మధుపర్కములనిచ్చి మాన్యుండు దక్షుండు
 స్వాగతించెను భక్తి పరమ శివుని
ప్రమథాదులాడగా పాడగా నారద
 తుంబురుల్, జయఘోష తుష్టి గొలుప

దివిజ వర్గంబు నింద్రుండు దీప్తి పెంచ
నెలమి ఋషి పత్ను లిరువంక నిలిచి గనుచు
నక్షతల్ జల్లు చాశీస్సు లంద చేయ
ఆది విష్ణువు తన వెంట నంత నడవ! 5

శ్రేయస్కరంబంచు శివ గణంబులు గొల్వ
 నంది వాహన మెక్కి నగర వీధి
నూరేగె వరునిగా ఉత్సవంబయె నద్ధి
 మేళ తాళ ధ్వనుల్ మిన్ను ముట్టె
సౌగంధ్య భరితమై సమలంకృతం బైన
 కల్యాణ వేదిపై, కనక మణి మ
యంబైన పీఠిపై, ఆనంద మూర్తియై,

సకల వైభవములు శాంతి గనగ

తన్ను బొందెనా యన్నట్లు, దర్ప మెసగ
స్థిర సమాసీను డయ్యును, స్థిమిత పడడు
తొయ్యలిన్ గాంచ చిత్తమ్ము తొందరింప
వ్యగ్రతాయత్త చిత్త విభ్రాంతు డగుట! 6

ఇక సతీదేవి సర్వాలంకరణ భూషితయై తన ఇష్ట సఖులతో కూడి....

దీపింప కల్యాణ తిలకమ్ము నుదిటిపై
ఫాలమతిశయింప బాసికమున
పాద పద్మాలపై పారాణి విరియంగ
కరముల గోరింట కాంతులీన
దరహాస భాసి తాధరములు చెలువార
చెక్కిలులు మెరయ సిగ్గు లొలికి
చంద్రికా దీప్తు లాస్యమున నటన మాడ
ఆనంద జలధులై అక్షు లలర

వంది మాగదుల్ సలుప కైవార తతులు
వేత్ర హస్తులు దారి చూపించు చుండ
సభ్యు లనిమేషులై గాంచ సాగె సతియు
భవ్య భావన లెదలోన పల్లవించ! 7

తలనుండి పిరుదుల దాటి సాగెడు వేణి
నటియించు నహిరాజు నటన జూప
కట్టిన మేలిమి పట్టు పుట్టంబుల
జలతారు ధగధగల్ గలయ వెలయ
అభ్యున్నతీ పాత్ర మని యెంచి ధరియించు
భూషణాల్ సౌందర్య భూతి పెంచ
కరకంకణంబుల కలరవంబు సెలంగ
మంజీర నాదంబు మరులు గొలుప

పద్మ పద్మజు రాణియు బంధు తతియు
ఇష్ట సఖులును నడవంగ హితులు వెంట
తన్వి రాయంచ యానయై తరలి సాగె
సుభగ కల్యాణ మంటప ప్రభలు పెంచ! 8

అమల సౌందర్య రాశి తా నభిలషించు
వరుని క్రీగంట గాంచ, దా పలుకరించ,
దగని సిగ్గుచే, సహజమౌ తత్తరమున
అదిమి పెట్టును యెదలోన నాశయముల! 9

సతి మనోభావాలను అవగాహన చేసుకున్న ఆమె చెలికాండ్రు ఆమెను ఆట పట్టిస్తూ ఇలా అంటున్నారట...

సుభగ సౌభాగ్య దీప్తియు సోయగమ్ము
కలయ నందాల రాశిపై నలరు తల్లి
భసిత కమ్ర స్మితా పూర్ణ వదను, వరుని
గనుము తలయెత్తి యొకమారు ఘనుని శివుని! 10

అంతటితో.. ఆగక ఆమె చెవిలో ఇలా అంటున్నారట...

స్మరు కేళి చుంబింప మగని మోమును డాయ
  ఫాల నేత్రాగ్ని మున్ భగ్గు మనును
సురతి శ్రమము బాయ వరుని యురము జేర
  ఫణిరాజు బుస్సంచు పలుకరించు
బిగియారు కౌగిటన్ విభుని బంధీ చేయ
  తలప నొత్తుకొను రుద్రాక్ష లెదను
హరిచందనాదుల నలది నీ పతి జేర
  ఆదరించును మున్ను బూది కంపు

వింత అనుభవా లెన్నెన్నొ యింతి నీకు
గలుగు సుఖియించు వేళ నీ కాంతు చెంత

ననుచు సరసాల పరిహాస మాడ చెలులు
వరుని క్రీగంట గనియె శంకరుని, సతియు! 11

అలా చూస్తున్న సతీ దేవికి శంకరుడు ఇలా కనిపించాడట....

శిరసుపై గంగమ్మ చిలిపిగా నర్తించె
జటలుగా మారె కేశములు గనగ
నిటలమ్ము నందగ్ని నియత దీప్తిని జూపె
గరళమ్ము గనుపట్టె కంఠమందు
కదలాడె నెదపైన కరి చర్మ మింపుగా
ఫణిరాజు మెడలోన పరుగు లెత్తె
చంద్రుండు మౌళిపై సరసమ్ముగా నిల్చె
పులితోలు శోభిల్లె మొలను జేరి

హరి యలంకృత రూపమ్ము అంతరించి
సహజ రూపమ్ము అమరె నా శర్వునకును
అరువు దెచ్చిన సొమ్ములు బరువు చేటు
అన్న నానుడి నిజమయ్యె హరుని యెడను! 12

ఆత్మ భూషణ సందోహ మపుడు వేడ
అభయ మిచ్చిన శివుడు కృపాకరుండు
సహజ భూషణ యుతుడు సాక్షాత్కరించె
గనుచు సతియు నానంద సంఘటిత యయ్యె! 13

వరుని రూపమ్ము మెచ్చె నా వధువు మదిలొ
రూపమును మించి గుణములు రూఢి కెక్కు
భద్ర జగతిని సుఖములు బడయ నగును
పరమ సౌఖ్యంబు లభియించు భవ్య జగతి! 14

ఇంతలో దక్షుని అనుమతిచే ...

అజుడు అవ్వేదిపై యాజ్ఞీకుడై నిల్చి
వేదోక్తముగ సల్ప పెండ్లి తంతు
దిక్పాలకాళి నిర్దేశిత స్థానముల్
గైకొని హిత శుభంకరులు గాగ
విష్ణ్వాది దేవతల్ విబుధ సంఘమ్ములు
ఋషులును మౌను లాశిస్సు లిడగ
జిలకర బెల్లమ్ము శీర్షమ్ములను దాల్చి
ముత్యాల తలబ్రాలు పోసుకొనుచు

సేసి పాణిగ్రహణమును శివుడు సతియు
అగ్ని సాక్షిగా తామేసి రడుగు లేడు
సన్న కల్లును ద్రొక్కిరి మున్ను, చివర
హవన విధులతో క్రతువు సమాప్తమయ్యె! 15

హితులు మిత్రులు బంధువు లెల్ల జనులు
వేడుకగ జూడ పూబంతు లాడి నారు
ధన్యతను బొందితేనంచు దక్షుడపుడు
పత్నితో గూడి పూజించె పరమ శివుని! 16

అర్ధమును వాక్కు లట్లుగా నలరు డనుచు
చీర సారెల నిచ్చి ఆశీస్సు లిచ్చి
అప్ప గింతలు జేసి తానంపి నంత
జనిరి దక్షుని వీడ్కొని సతియు శివుడు! 17

పరమ శివకర సంయోగ భాసురమ్ము
శ్రీ సతీదేవితో పెండ్లి శివుని కగుట
శివము సుందర చైతన్య జీవ గతియు
సత్య దీప్తమ్ము పరతత్వ సార మదియు! 18

శుభం భూయాత్



# సమతుల్యం

ఎలక్ట్రాన్

ఉన్నట్టుండి ఓ రోజు మాసంస్థ అధ్యక్షుడినుంచి ఫోన్ వచ్చింది. "మూర్తీ, రేపు పదహారో తారీఖున నేను విశాఖపట్నం వస్తున్నాను. నువ్వొచ్చి నన్ను మన అతిథి గృహంలో కలుసుకో. నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. నిన్ను విశాఖపట్నం ట్రాన్స్ఫర్ చేద్దామనుకొంటున్నాను. నువ్వు పదిహేనుకల్లా విశాఖ వచ్చి సిద్ధంగా ఉండు," అని నాకు వేరు ఆస్కారమివ్వకుండా ఫోను పెట్టేశాడు.

అంటే ఆయన ఏదో విషయమై నాతో రహస్యంగా మాట్లాడదలచుకొన్నాడని విదితమైంది. ఇది నా కొక గర్వకారణమే అయినా, బదిలీ మాట వినగానే నాకు సంసారపక్షంగా కొన్ని అనుకూలతలు, కొన్ని ఇబ్బందులు, కళ్లెదుట నిలిచాయి.

విశాఖపట్నం బదిలీ అంటే రాజమహేంద్రవరంలో మా తమ్ముడివద్ద ఉంటున్న తల్లిదండ్రులను ఒప్పించి నా దగ్గరకు తీసుకొనివచ్చే అవకాశం పెరగుతుంది. ఎందుకంటే కన్యాకుమారి రావడానికి వారు ససేమిరా ఇష్టపడలేదు. త్రిసాగర సంగమస్థలం కన్నా రాజమహేంద్రవరం గౌతమీ గోదావరే వారికి ప్రాణప్రియం. ఇప్పటికే ఇది నా బంధుమిత్రులకి మరో కోణంలో కనిపించి, 'పెద్దవాడయ్యుండీ కూడా తల్లిదండ్రుల బాధ్యత తమ్ముడిమీదకు నెట్టేశాడ'న్న చాపకింది నీరులాంటి అభియోగం ప్రబలింది. తల్లిదండ్రుల నిమిత్తం నేను ప్రతినెలా ఆరువేలకి తగ్గని సొమ్ము నా తమ్ముడికి పంపిస్తోనే ఉన్నాను. ఈ సంగతి ఎవ్వరికీ వెల్లడి చేయకూడదని ఓ ఒప్పందం చేసుకొన్నాం. కారణం మూతి విరుపుల నా సతీమణి నా తమ్ముడి భార్యని చులకనగా చూస్తుందన్న ఓ భయం. 'పెద్దకోడలు బంధుమిత్రులకు దూరంగా, హాయిగా కాపురం చేస్తోంది, చిన్నకోడలిగా నేనే ఈ బండ చాకిరీ చేయవలసి వస్తోంది,' అని నా తమ్ముడి భార్య వాడిదగ్గరా, పుట్టింటివారి దగ్గరా అంటూనే ఉంటుందని వాడి బాధ వాడిది. ఇందులో వాడికి, వాడి భార్య అభిప్రాయానికి సమాంతరంగా బంధువర్గంలో మంచివారన్న ముద్రపడి చాలారోజులే అయింది. బుద్ధి గడ్డితిని, అధ్యక్షులవారు బదిలీ సంగతి ఎత్తారన్న విషయాన్ని చెప్పగానే శ్రీమతి అననే అనేసింది. "ఇకనేం? అందరూ వచ్చి నెత్తిమీద కూర్చుంటారు! చేయలేక చావాలి! అందులోనూ విశాఖపట్నం మూడింట ఒక రాజధానిగా ఉంటుందని నిశ్చయించారు కదటా? అతిథుల ఒత్తిడి కూడా పెరిగిపోతుంది!" భార్యల మాటలు ఈటెల్లా వచ్చినా, ఆ ఒక్క అవసరంకోసం భర్తలు నోరు మూసుకొని కూర్చోవాల్సివస్తుంది. ఇక్కడ భార్యలెంతవరకూ చదువుకొన్నారన్న ప్రసక్తి, ప్రశ్నా లేనేలేవు. సంస్కారమొక్కటే ప్రధానం. అయితే 'స్త్రీకి నేనూ, నా మొగుడూ, పిల్లలూ అనే స్వార్థం వివాహంతో మొదలవుతుందనీ, అది సహజమేననీ' సమర్థించేవాళ్లు లేకపోలేదు. అందుకే నా జీతభత్యాలగురించీ, బోనస్ ల గురించి శ్రీమతికి ఎప్పుడూ వివరంగా చెప్పలేదు.

"పిల్లలిక్కడ సెంట్రల్ స్కూల్లో అరవ్వాళ్లతో పోటీపడి తొంభైలు దాటి మార్కులు తెచ్చుకొంటున్నారు. మరుచటి సంవత్సరానికి క్లాసు పది పూర్తవుతుంది. అప్పుడు వెళ్ళినా అర్థం పర్థం ఉంటుంది. బదిలీ ఆపుచేయించుకోండి." అని ఓ గంటసేపు నస పెట్టింది. "ఇక్కడ కన్యాకుమారి ప్లాంట్




08-06-1942 **కీ.శే. పింగళి అన్నపూర్ణ** 21-01-2024

(మన పత్రిక రచయిత శ్రీ పింగళి వెంకటరమణారావు (ఎలక్ట్రాన్) సతీమణి)

ఆత్మకు శాంతి చేకూరాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

అభివృద్ధి జరగడంలోని నా అనుభవాన్ని గణనలోకి తీసుకొని నన్నక్కడికి బదిలీ చేద్దామనుకొంటున్నారేమో? అక్కడ నాకు పదోన్నతుల అవకాశం బావుంటుంది. సెంట్రల్ స్కూల్ కాబట్టి సిలబస్ మారదు. విశాఖలో అయితే వందకి వంద కాకపోయినా ఒక మార్కు తక్కువగానైనా మార్కులు తెచ్చు కొంటారు. అదీ కాక నీ, నా తల్లిదండ్రులు దగ్గరగా ఉంటారు," అన్నాను.

శ్రీమతి వెంటనే మాట మార్చింది. "సర్లెండి, బదిలీ ఉత్తర్వులు రాకముందే మీరోసారి ఏదో ఆఫీసు పనిమీద విశాఖపట్నం టూర్ వేయించుకొని వెళ్ళండి. లేదా ఓ నాలుగైదు రోజులు సెలవు పెట్టి వెళ్ళండి. పిల్లలకి స్కూలు అడ్మిషన్ సంగతీ అవీ విచారించండి. క్వార్టరూ అదీ కాస్త మంచిదిగా ఉన్నదాన్ని వచ్చేటట్టుగా చూసి రండి. ఆలోపుగా నేనిక్కడ సామాను సంగతీ అవీ చూసి, అనవసరమైనవాటిని వదిలించుకొనే జాబితా తయారు చేస్తాను. లేకపోతే అక్కడి క్వార్టరు ఇరుకైపోతుంది."

పదో తరగతి చదువుకొన్న నా శ్రీమతి మాటతీరూ, శ్లేష గమనించే ఉంటారు.నేనెక్కడుంటే తనక్కడుంటేనే నా తల్లిదండ్రుల బాధ్యతకు నేను దూరంగా ఉండేటట్టు కట్టడి చేయగలదన్న దురుద్దేశ్యం ఆమెలో కలిగిందన్న అభిప్రాయం కలిగింది.

టూర్ అనుమతికోసం ప్రాజెక్టు మేనేజర్ వరదన్ గారిని కలుసుకొన్నాను. "ఛైర్మన్ నిన్ను విశాఖకి టూర్ మీద పంపమని నిన్ననే ఫోన్ చేశాడు. వెళ్ళిరా," అన్నాడు. పద్నాలుగున విమానంమీద కన్యాకుమారి నుంచి చెన్నై మీదుగా రాజమహేంద్రవరం వెళ్ళి, ఒక రాత్రి ఆగి తల్లిదండ్రులను చూశాను. విశాఖపట్నం బదిలీ అయ్యే అవకాశముందని చెప్పాను. 'పోనీలే దగ్గరకొస్తావు' అంది అమ్మ. అమ్మ చేతిలో పదివేలు పెట్టబోతే 'తల్లి దండ్రుల చేతికి కొడుకులు సొమ్ము నేరుగా అందించకూడదని ఎన్ని సార్లు చెప్పాలిరా మీకు? అలా బల్ల మీద పెట్టు,' అంది అమ్మ. నాకు ఋణానుబంధం కథ తెలుసు. శ్లోకం గుర్తులేదు. పదిహేను ఉదయం విమానంలో రాజమండ్రి నుంచి విశాఖ పదింటికి చేరాను. క్యాబ్ తీసుకొని సముద్రపుటొడ్డుకు ఎగువగా ఉన్న మా సంస్థ అతిథిగృహంలో దిగాను. అతిథిగృహం నిర్వాహకుడు నన్ను పలకరించి, తన్ను నరసింహంగా పరిచయం చేసుకొని, స్వల్పకాలం సెలవు మీద వచ్చానని తెలుసుకొని రెండో అంతస్తు లోని ఓ గదికి తీసుకుపోయి, ఏది ఎక్కడుందో చెబ్తూ, గదిని చూపించి వెళ్ళాడు. తలుపులు దగ్గరగా

లాగి, ఉదయంనుంచీ ధరించిన బూట్లని విప్పి దూరంగా ఉంచి, ఏసీ వేసి సోఫా కుర్చీలో కూలబడ్డాను. ఎవరో తలుపు మీద తట్టి, "లోపలికి రావచ్చా సర్," అని అడిగారు. రమ్మని చెప్పగానే, నా వయసులో ఉన్న ఓ వ్యక్తి వచ్చి, "సర్! మంచి నీళ్లూ, కూల్ డ్రింకులూ ఫ్రిజ్ లో ఉన్నాయి. మీకు కాఫీ తెమ్మన్నారా, టీ తెమ్మన్నారా?" అని అడిగాడు. పేరడిగి సోమూ అని తెలుసుకొన్నాను.

"కాఫీ పట్టుకు రా." అన్నాను. పావుగంట తర్వాత అతను ఓ ట్రేతో వచ్చాడు. తళతళలాడే స్టీలు ఫ్లాస్కునీ, మేలురకం కాఫీ కప్పునీ, బచ్చన్ బ్రాండ్ జీడిపప్పు బిస్కట్లున్న ప్లేటునీ, బల్లమీద పెట్టి నిలుచున్నాడు. "ప్రస్తుతం అతిథి గృహంలో ఎంతమందున్నారు? " అడిగాను, కాఫీ కప్పులో పోసుకుంటూ. . "ఈ రోజుకి మీరొక్కరే. మొత్తం పది గదులున్నాయి. ఒకటి ప్రత్యేకం మీ కంపెనీ అధ్యక్షుడికి కేటాయింపు. ఎవరికీ యివ్వరు. తాళం నరసింహంగారి వద్ద ఉంటుంది. రేపటి సాయంత్రానికి మీ కంపెనీ అధ్యక్షులవారొస్తున్నారని నరసింహంగారు చెప్పారు. ఇక్కడి పురప్రముఖులతో, స్థానిక ఏం.ఎల్.తో ఏదో సమావేశముందిట. ఎల్లుండి మీ ప్రాజెక్టు ఆఫీసులో ఏదో మీటింగ్ ఉందట. నరసింహంగారు సరుకులూ అవీ కొనడానికి ఊళ్ళోకి పోయారు. ఇక కనబడేది సాయంత్రమే. పదకొండు దాటింది వంట చేస్తాను," అన్నాడు సోము. అలాగే అన్నట్టుగా తలూపాను. సోమూ గదివదిలి వెళ్ళాడు. ఒంటిగంటకు భోజనం చేసి, నడుము వాల్చి, సాయంత్రం సముద్రపుటొడ్డుకు పోయితిరిగాను. ఏవో బీచి చిరుతిళ్ళు తిని ఆ రాత్రికి ఉపవాసం చేశాను. పదహారు ఉదయం నేను ఏకంగా తయారై ఏడున్నరకల్లా భోజనశాలకి పోయి ఉపవాస భంగం చేసాను. మధ్యాహ్న భోజనానికి రానని చెప్పి, ఊళ్ళో ఉన్న నా మేనమామ గారి అబ్బాయి బాబ్జీని తీసుకొని కేంద్రీయవిద్యాలయనికి వెళ్ళి, కథాకమామీషూ తెలుసుకొని, వారిచేత అవుననిపించుకొని, మావాడితో వాళ్ళింట్లోనే భోజనం ముగించాను. సాయంకాలం కైలాసగిరిమీదకు తీసుకుపోయాడు. ఓ గంటసేపు అక్కడ గడిపిన తర్వాత చీకటిపడే వేళలో మా వాడు నన్ను అతిథిగృహంవద్ద దింపి వెళ్లిపోయాడు. హాల్లో ప్రవేశించేసరికి మా కంపెనీ అధ్యక్షుడితో సహా కలిపి ఓ ఆరుగురు సోఫాల్లో కూర్చుని మాట్లాడుకొంటున్నారు. అతిథిగృహం వ్యవహారాలూ చూసే నరసింహంగారు హాలుబయటి వసారాలో, గుమ్మం దగ్గర ఓ కుర్చీమీద చేతులు కట్టుకొని కూర్చున్నాడు. మా కంపెనీ అధ్యక్షుడుతప్ప మిగిలినవారెవరూ నాకు తెలియదు. దగ్గరగా వెళ్ళి కంపెనీ అధ్యక్షుడికి నమస్కారం చేశాను.. "రావోయ్ మూర్తీ రా! ఏమిటిలా వచ్చావు?" ఆయన పలకరింపులో ఏదో గోప్యతతో కూడిన హెచ్చరిక ధ్వనించింది.. "మా మేనమామగారింట్లో ఏదో శుభకార్యం జరుగుతోంది సర్! తప్పనిసరిగా రావాల్సిన విషయం కాబట్టి సెలవు పెట్టి వచ్చాను," అనిఒకకుర్చీలాక్కొనికూర్చున్నాను "వీరందరూ పురప్రముఖులు. నేను వచ్చానని తెలిసి వచ్చారు. వీరి పరిచయం కొద్దిసేపటి క్రితమే అయిన మూలాన, ఇప్పుడే వారిని పేరు పేరునా నీకు పరిచయం చేసే ధారణశక్తి నాకు లేదు. అందరూ క్షమించాలి." అని, ఆయన నన్ను తమిళనాడులోని మా సంస్థ తాలూకు ఓ ఉద్యోగిగా పరిచయం చేశాడు. కాస్త కుర్చీలోంచి పైకి లేచి, అందరికీ ఒక ఉమ్మడి నమస్కారం చేసి, తిరిగి కుర్చీలో కూర్చున్నాను. వారితోబాటు భోజనశాలలోకి నడిచాను. భోజనాలైన తర్వాత అందరూ అధ్యక్షుల వారికి ఒకటికి రెండు నమస్కారాలు చేసి వెళ్ళిపోయారు.

నేను గదికి వెళ్ళిన అయిదు నిముషాల్లో సోమూ పరుగున వచ్చి "ఛైర్మన్ గారు మిమ్మల్ని వారి గదికి రమ్మన్నారు," అని కబురందించాడు. వెంటనే వెళ్ళాను. ఆయన నన్ను కుర్చీలో కూర్చోమని, విస్తృత సమాచారంగల కొన్ని కరపత్రాలందించాడు "రేపు ఉదయం పదింటికి మన సంస్థ సమావేశమందిరంలో జర్మనీ, ఫ్రాన్స్, యుకె, యుఎస్, సంస్థల సాంకేతిక నిపుణులు మాట్లాడబోతున్నారు. ఇక్కడి

మన సంస్థ అధినేత, వివిధ విభాగాధిపతులూ ఆసమావేశంలో పాల్గొంటారు. ఆయా సంస్థల ఏజెంట్స్ నన్ను ఢిల్లీలో కలుసుకొని స్వయంగా ఇచ్చిన బ్రోచర్లు ఇవన్నీ. చదివి ప్లస్, మైనస్ పాయింట్లు నోట్ చేసి, రేపటి సమావేశంలో ప్రశ్నల శరాలు వదలాల్సిన బాధ్యత నీదే!" అన్నాడు.

"సర్! నా మీద మీకున్న నమ్మకానికి థాంక్స్. కానీ అన్ని శరాలూ నేనే సంధిస్తే నా పై అధికారులకీ, ఇతర విభాగాధిపతులకీ ఇబ్బంది కలగవచ్చు. బ్రోచర్స్ నాకు ముందుగానే అందించి తయారు చేశారని అందరూ అనుకోవచ్చు సార్! అది మీకు మంచిది కాదు. అందుకని రేపటి సమావేశ సమయంలో వారు చెప్పింది విని, చూపించేది చూసి నాకు తోచిన పదునైన ప్రశ్నలు తప్పక అడుగుతాను. ఇందులో స్వోత్కర్ష కనక కనిపిస్తే క్షమించండి సర్!" అన్నాను వినమ్రంగా.

"సంస్థ అధ్యక్షుడనైన నాకే ఈ సాంకేతికసమాచార పత్రాల్ని నిన్న ఢిల్లీ వదలబోతున్న సమయంలో అందించారు. ఢిల్లీలోని సంబంధిత మెంబర్లకీ, ఇక్కడి సంస్థలోని విభాగాధిపతులకి ఇవన్నీ ఎప్పుడో అందాయన్న సంగతి నాకు తెలుసు. ఆ కంపెనీల పైరవీలు ఎప్పట్నుంచో మొదలయ్యాయి. వీటి ఆధారంగానే ఇక్కడి ప్రబుద్ధులు ప్రాజెక్టు విస్తరణకి ప్రొపోజల్స్ పెట్టారు. అందుకని తీసుకొనివెళ్ళీ చదువు. నేను అయిదింటికల్లా లేచిపోతాను. బ్రోచర్స్ నాకిచ్చేసెయ్యి. రేపు వాటిని నా ముందుంచుకొంటాను. ఎవరికీ అనుమానం కలగదు."

ఆ రాత్రి ఒంటి గంటవరకూ చదివి, ప్రతీ కరపత్రంలోనూ కొన్ని అవసరమైన ప్రశ్నలు లేవనెత్తి, సంబంధిత పేరాల పక్కన రాశాను. పడుకొని ఉదయం నాలుగింటికే లేచి, కాలకృత్యాదులు తీర్చుకొని, అధ్యక్షుడి గదివద్దకు వెళ్ళి తలుపు తట్టాను. వెంటనే తలుపులు తెరుచుకొన్నాయి. కరపత్రాలు ఆయనకి అందించి, "నేను సమావేశానికి రాలేను సర్! క్షమించాలి," అని ఆయనకి స్పందించే అవకాశం లేకుండా వెనుతిరిగాను. ఆ తర్వాత తలుపులు మూసుకొని పదింటిదాకా పడుకొన్నాను. పదింటికి వెళ్ళి కనకమహాలక్ష్మి దర్శనం చేసుకొని తిరిగి వచ్చాను. సాయంకాలం వరకూ ఇద్దరు ముగ్గురు తెలిసున్నవారిని పలకరించి వచ్చాను. అతిథి గృహమంతా నిశ్శబ్దంగా ఉంది. రాగానే సోమూ వచ్చి, "చైర్మన్ గారు మీరు రాగానే తనని కలుసుకోమన్నారు. మీరాయన గదిలోకి వెళ్ళగానే వేడివేడిగా మిరపకాయ బజ్జీలు, పకోడీలూ, కాఫీ తీసుకురమ్మన్నారు," అని చెప్పి వెళ్లిపోయాడు. నేను వెంటనే ఆయన గదికి వెళ్ళాను. నన్ను కూర్చోమని చెప్పి, ఛైర్మన్ నవ్వుతూ, "థాంక్స్ మూర్తీ! నా ముఖతా నువ్వు వదిలిన బాణాలు అందరి నోళ్లూ మూయించాయి. ఆయా సంస్థల సాంకేతిక నిపుణులు చాలా సందర్భాలలో నీళ్ళు నమిలారు. రెండువందలయాభై కోట్ల విస్తరణ ప్రపోజల్ని ఒక్క దెబ్బతో కొట్టిపారేయదల్చుకొన్నాను. రేపు ఇరవయ్యో తారీఖున జరగబోయే బోర్డు సమావేశంలో నా నిర్ణయం తెలియజేస్తాను. అసలు సంగతేమిటంటే జియో పాలిటిక్స్ అనబడే స్థానిక రాజకీయాలు చోటు చేసుకొన్నాయి. ఇక్కడి ప్లాంట్ చుట్టూతా కొన్ని బంజరు భూములున్నాయి. వాటిని స్థానిక నాయకులు అతిచౌకగా ఎప్పుడో కొని పారేశారు. మన విస్తరణ పథకం కింద వారాభూముల్ని అత్యధికమైన ధరలకు మనకు అమ్ముదామని పథకం వేశారు. ఇక్కడి మన సంస్థలోని కొందరు, అక్కడ ఢిల్లీలోని మరికొందరు సహకరించి ఈ విస్తరణ ప్రొపోజల్స్ చాలా పకడ్బందీగా పెట్టారు. అనేకమైన విషయాలలో తలమునకలైన నేను ఈ ప్రొపోజల్ సవ్యంగానే ఉందనుకొన్నాను. దరిదాపులుగా శాంక్షన్ చేసేద్దామనుకొన్నాను. ముందస్తుగానే నువ్విక్కడుంటే బావుంటుందని నీ బదిలీ గురించి ఒక ఆలోచన వచ్చింది. సంస్థ ప్రయోజనాలు గుర్తించిన నువ్వు, నన్ను సరైన మార్గంలో నడిపించావు."

సోము మిరపకాయ బజ్జీలు, పకోడీలు, కాఫీ తీసుకొచ్చి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

"సర్! సంస్థ ప్రాంగణ వైశాల్యం పెంచకుండా, ఉన్న యంత్రాల-

కీ, ప్రోసెసింగ్ విధానాలకీ కొద్దిపాటి మార్పులతో, స్వల్పసంఖ్యలో కొన్ని అనుబంధ యంత్రాలతో ఉత్పత్తి రెట్టింపు చేయవచ్చు. ఇవన్నీ మనం దేశీయంగానే అమలు పరుచుకోవచ్చు. ఖర్చు పాతిక కోట్లకి మించదు. నేను కన్యాకుమారి వెళ్ళగానే ఇది ఎలా సాధించవచ్చో మీకు విశదంగా ఓ రహస్య నివేదిక పంపిస్తాను. "

"అంటే ....?"

"నా మూలంగానే వారనుకొన్న విధానంలో విస్తరణ ఆగిపోయిందని తెలిస్తే, ఇక్కడకి బదిలీ మీద వచ్చే నేను పని చెయ్యడం చాలా కష్టమైపోతుంది. జియో పాలిటిక్స్, మీడియా తెలుగువాడైయ్యిండీ సీమాంధ్ర తల తెగనరికాడని విరుచుకుపడొచ్చు. అడుగడుగునా ఆటంకాలు ఎదురౌతాయి. అందుకని ......"

"ఆ అపనింద తెలుగు వాడిగా కాకపోయినా, సంస్థ అధ్యక్షుడనైన నాకూ, కేంద్రప్రభుత్వానికీ కూడా కలుగుతుంది. పార్లమెంటులో ప్రశ్నలు తలెత్తుతాయి. కేంద్రప్రభుత్వం నన్ను తప్పక ప్రశ్నిస్తుంది. ప్రభుత్వానికి మనం నచ్చచెప్పగలం. అయితే ఉత్పత్తి దృష్ట్యా సంస్థ విస్తరణ అవసరం. నిన్ను ఢిల్లీకి బదిలీ చేస్తాను. వచ్చి ప్రాజెక్టు విస్తరణ విభాగంలో చేరు.".

నేను ఆ మర్నాడు తిరిగి కన్యాకుమారి వెళ్లిపోయాను. కేంద్రీయ విద్యాలయంలో పిల్లల ప్రవేశానికి సమస్య లేదని శ్రీమతికి చెప్పాను. వారం రోజుల్లో నాకు ఢిల్లీ బదిలీ అయినట్టు ఉత్తర్వులొచ్చాయి. నేను కొంచెం ఆశ్చర్యం నటించాను. శ్రీమతి ఆనందానికి హద్దులు లేకపోయాయి. నేను వెంటనే ఒంటరిగా వెళ్ళి చేరిపోయాను. పిల్లలకి వార్షిక పరీక్షలైపోయిన వెంటనే కుటుంబాన్ని కన్యాకుమారినుంచి ఢిల్లీ తీసుకుపోయాను. అందనంత దూరప్రాంతానికి బదిలీ చేయించుకొన్నానన్న అపప్రథ కుటుంబ వ్యవస్థలో మరో మెట్టు ఎక్కింది. అమ్మానాన్నల్ని గౌతమి కట్టి పడేసింది. తమ్ముడిమీద పూర్తి భారం పడకుండా చూస్తున్న నాతో వాడు ఎప్పుడూ ఏ విషయం లోనూ ఘర్షణ పడలేదు. ఢిల్లీలో పనిచేస్తూ విశాఖ శాఖ ఉత్పత్తిని రెట్టింపు చెయ్యడానికి తక్కువ ఖర్చులో నేను రూపొందించిన ప్రణాళికకి బోర్డు ఆమోదం తెలిపింది. వెంటనే నాకు పదోన్నతి కలిగింది. కన్యాకుమారి మా శాఖ అధిపతి వరదన్ గారికి విశాఖకి, విశాఖ అధిపతికి అహ్మదాబాద్ కి, అహ్మదాబాద్ అధిపతికి కన్యాకుమారికి బదిలీలు అయ్యాయి. ఈ బదిలీల తతంగం పూర్తయిన తర్వాత నన్ను విశాఖకు బదిలీ చేశారు. నా కన్యాకుమారి బాస్ వరదన్ గారూ, నేనూ విశాఖలో మళ్ళీ జత కట్టాం. ఏ విషయంలోనైనా జట్టుస్ఫూర్తి అనేది అవసరం కదా? నాకువచ్చినపదోన్నతికి శ్రీమతి సంతోషించినా, పిల్లలకి విద్యాభంగం కలగకుండా ఉండడానికీ, ఆమెని ఒప్పించడానికీ నేను కుటుంబపరమైన ప్రణాళికని రచించి, విశాఖలో అడుగు పెట్టడంతో విజయం సాధించాననే అనుకోవాలి. ఉద్యోగధర్మానికీ, కుటుంబధర్మానికీ మధ్య సమతుల్యం సాధించడానికి అవస్థలు పడక తప్పదు మరి!

---

## మెరుపుల్లేని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

(22 వ పేజీ తరువాయి)

ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. (లఖ్‌పతీ దీదీ పథకం)

శ్రీ 2009`10 నుంచి 2014`15 వరకు ఉన్న ప్రత్యక్ష బకాయిలు 25 వేల లోపు డిమాండ్ నోటీసులు, మరియు పదివేలలోపు బకాయి నోటీసులను ఉపసంహరించుకోనున్నారు. దీనివల్ల కోటిమంది రు 3,500 కోట్లు లబ్ధి పొందుతారు.

శ్రీదిగుమతి సుంకాలు సహా ప్రత్యక్ష, పరోక్ష పన్నులు విధానంలో ఎలాంటి మార్పులు ఉండవన్నారు.

ఈ బడ్జెట్ ''సమ్మిళిత, సృజనాత్మకమైనదని వికసిత భారతీయ మూల స్థంభాలైన పేదలు, యువత, మహిళలు, అన్నదాతలు అనే భారత్‌లోని నాలుగు స్థంభాలకు ఇది సాధికారత చేకూరుస్తుందని ప్రధాని మోదీ ప్రశంసించారు. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ఈ బడ్జెట్ ఓ గ్యారెంటీ'' అని పేర్కొన్నారు.

విశ్లేషణ: డా॥కె.రామానందం

# సంగీత సాహిత్య సమలంకృతులు డా. సంగనభట్ల నర్సయ్య



తుమ్మూరి రాంమోహనరావు

నీలమేఘశ్యామ నీవె తండ్రివి మాకు

కమలవాసిని మమ్ము గన్నతల్లి

నీ భక్తవరులంత నిజమైన బాంధవుల్

నీ కటాక్షము మాకనేక ధనము

నీ కీర్తనల్ మాకు లోక ప్రపంచంబు

నీ సహాయము మాకు నిత్యసుఖము

నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య

నీ పద ధ్యానంబు నిత్యజపము

తోయజాతాక్ష! నీపాద తులసిదళము

రోగములకౌషధము బ్రహ్మ రుద్ర వినుత

భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!

దుష్టసంహార!నరసింహ!దురితదూర!

రెండు తెలుగురాష్ట్రాల్లోనే గాక ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన శతకాల్లో నరసింహశతకం ఒకటి. తెలంగాణా రాష్ట్రం లో కరీంనగరం జిల్లాలో ప్రవహించే గోదావరీ దక్షిణ తీరస్థ ప్రసిద్ధ నారసింహ క్షేత్రం ధర్మపురి బ్రాహ్మణాగ్రహారం.ఆదేవాలయ సేవలో తరిస్తూ నరసింహ శతకం రచించిన శేషప్ప ధన్యుడు.

అలాంటి పుణ్యక్షేత్రంలో పురుడు పోసుకున్న సుప్రసిద్ధ పండిత కవి, రచయిత ,పరిశోధకులు, వైయాకరణులు, నటులు, గాయకులు,వాగ్మి,సంగీత పరులు, దర్శకులు ఇలా ఆంగ్లంలో What not? అనగలిగిన సకలకళాకోవిదుడు డా.సంగనభట్ల నర్సయ్యగారు..కొందరు అసమాన బహుముఖీన ప్రతిభా శాలుర గురించి రాయాలంటే కష్టతరమే. ఏ రంగంలో నైనా పారం ముట్టే ప్రతిభ అతి కొద్దిమందికే దైవానుగ్రహంగా లభిస్తుంది. అలాంటి వారైన నర్సయ్యగారు చారిత్రక ,శాసన ,సాహిత్య పరిశోధనలో అందె వేసిన చేయి. స్థానిక చరిత్రను తవ్విపోసి జన్మభూమి ఋణం తీర్చుకున్న పుణ్యజీవి,పద్యనాటక రంగాన్ని పట్టువదలని విక్రమార్కుడివలె ముందుకు నడిపిస్తున్న కార్యశీలి. ప్రబంధాలు, కావ్యేతిహాసాలు, వ్యాకరణాంశ విశేషాలు, సంగీత సాహిత్యసంబంధిత మైనవే గాక నాటక రంగ పుట్టు పూర్వోత్తరాలు , వేదాలు, ఉపనిషత్తులు , తెలుగు, హిందీ, సంస్కృత భాషల కవులు రచయితల గురించిన లోతుపాతులు అనర్గళంగా ప్రసంగించగలిగిన దిట్ట ఎవరైనా ఉన్నారా అంటే అది సంగనభట్ల



నర్సయ్యగారు మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. ఇది ఎక్కడో చదివి రాస్తున్నది కాదు. ప్రత్యక్ష సాక్షిగా చూసి రాస్తున్న విషయం.

దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం వారితో పరిచయమేర్పడింది వరంగల్ విశ్వేశ్వరాంధ్ర కళాశాల ఏర్పాటు చేసిన సంగోష్ఠి కార్యక్రమంలో. నాటి నుండి మా ఇరువురిది సోదర సంబంధం. నా మానేరు ముచ్చట్లు ( అప్పట్లో మా ఊరు ఎలగందుల చరిత్ర) రాయాలని ఉంది అన్నప్పుడు వారు ప్రోత్సహించిన సంగతి మరువ లేని విషయం.

పుట్టిన ఊళ్లోనే చదువుకొని అక్కడే పూర్తికాలం ఉద్యోగం చేసే అవకాశం కూడా అరుదుగానేకొందరికే లభిస్తుంది. అలాంటి అరుదైన అవకాశం పొందిన భాగ్యశాలి కూడా డా. సంగనభట్ల నర్సయ్యగారే.

పదేళ్లకే చందమామ పత్రికతో పఠనాసక్తి ఏర్పడి , ఏడవ తరగతి చదువుతూనే డిటెక్టివ్ పుస్తకాలు కిరాయికి ఇచ్చే తేలాలో ఉన్న దాదాపు రెండువందల నవలలు



చదవటమే గాక ఓ డిటెక్టివ్ నవల కూడా రాసిన ఘనత నర్సయ్య గారిది. పెద్దల మందలింపుతో అవి వదలి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ స్థానిక నిర్వాహకులైన శ్యామ సుందర శాస్త్రిగారి వద్ద చేరి హిందీ పరీక్షలు పాసై పదవతరగతికి వచ్చేసరికి , తన తోటి వాళ్లు ఆడుకునే వయసులో , వేళలో హిందీ విద్యార్థులకు సాయంకాలం పాఠాలు చెప్పిన పసి పంతులయ్య మన నర్సయ్య. ఈ సమయంలోనే హిందీ నవలలు, మైథిలీ శరణ్ గుప్త వంటి ప్రసిద్ధ కవుల పుస్తకాలు, హిందీ భాషలోకి అనువదింప బడిన బెంగాలీ కవిత్వం చదివి-,ఆ భాషలో పట్టు సాధించారు. అలాగే మాతామహులు సంగీత పరులు కావడంతో సంగీత సాధన కూడా కొనసాగేది.అంతే గాక ఉపనయనం కాగానే తండ్రిగారైన బ్రహ్మశ్రీ సంగనభట్ల వెంకన్న గారి వద్ద, సంధ్యావందనం తోపాటు వేదం నేర్చుకున్నారు.వీరి పెదనాన్న గారు ఘనపాఠి. తల్లి నర్సుబాయమ్మ, బడి చదువులు చదువకున్నా వేదం , పురాణేతిహాసాలు, స్త్రీలపాటలు , కీర్తనలు తెలిసిన విదుషీమణి కావడంతో అనేక విద్యలు ఇంట్లోనే ఒంటబట్టాయి.


1969 లో H.S.C. ( అప్పట్లో పదకొండో తరగతి ) కి రావడం అప్పుడే తొలి తెలంగాణా ఉద్యమం కూడా రావటంతో ఉద్యమంలో పాల్గొని జైలు పాలవటం కూడా జరిగింది.ఆ తరువాత స్థానిక ఓరియంటల్ కళాశాలలో డి.ఓ.ఎల్, బి.ఓ.ఎల్ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు.

వెంటనే స్థానిక ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరి సాయంకాలం సంస్కృత కళాశాలలో చదువుకున్నారు. తన తోటి వారు పలు ఉద్యోగాలవైపు వెళినా ఈయన మాత్రం అదే ఉద్యోగం చేస్తూ అధ్యాపకునిగా ఉపన్యాసకుడిగా కూడా చేసి అతి చిన్న వయసులో 28వ ఏట ప్రిన్సిపాలుగాలపదోన్నతిని పొంది అవిచ్ఛిన్నంగా 28 సంవత్సరాలు ప్రాచ్య డిగ్రీ కళాశాల ప్రాంశుపాలునిగా చేసి 2010 పదవీ విరమణ పొందారు.

అది ఒక ఎత్తైతే, చిన్నప్పటినుండే అలవడిన రచనాభిలాష కొనసాగిస్తూ పత్రికలకు వ్యాసాలు రాయడం, స్థానిక చరిత్రలు వెలికి తీయడం, శాసనాలు వెతికి వెలుగులోకి తేవడం వంటి అనేక పరిశోధనలు జరిపి తత్సంబంధిత వ్యాసాలు రాయడంతో వీరి పేరు బాగా వెలుగులోకి వచ్చింది. అప్పట్లో వీరు రాసిన అచ్చైన ఒక వ్యాసం చదివి ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులు బిరుదురాజు రామరాజుగారు వీరికి పిలిచి పి.హెచ్డీ సీటిచ్చారు.తెలుగులో దేశీ ఛందస్సు ప్రారంభ వికాస దిశలు అన్న అంశంపై శ్రీమతి పాకాల యశోదారెడ్డి గారి నేతృత్వంలో డాక్టరేటు పట్టా పొందారు.

(సశేషం)

# గళ్ళ నుడికట్టు



## ఆధారాలు - అడ్డం

1) రామాయణములోని ఈ భాగం చదవటానికి కొందరు సంశయిస్తారు (5)
3) దీన్ని రాష్ట్రరాజధాని చేయొచ్చని ఓ మంత్రిగారన్నారు (5)
6) గడ్డిపోచ సమానము (5)
9) దీంతో జావ కాస్తారు,అక్షరాలు అటూ ఇటూ (4)
11) ఇది వేరే పెట్టడమంటే విడిపోవడం(3)
12) బలిమి,అక్షరాలు అటూఇటూ (2)
14) పతివ్రత (3)
15) వేప,అక్షరాలు అటూఇటూ (2)
17) తేనీరు చేయటానికి కావలసిన ఆకు(3)
18) పల్లం కాదు (3)
19) సురారులమ్మ...పుచ్చినయమ్మ(5)
21) నాలుగు స్వరాలు,అటూఇటుగా (4)
22) పిల్ల (2)
23) ముద్ద, అట్నుంచి (3)
24) కంగారు (3)
26) కులుకులు ,అట్నుంచి (5)
27) అలసట (3)
28) ఇది పీక్కు తింటుందట (3)
30) నాసిక (2)
32) విడుదల, అట్నుంచి (3)
33) బడాయి మాటలు (3)
35) కొద్దో గొప్పో (4)
37) వీడు లేని ఊరు విడవాలిట (9)
42) మనిషైతే ఇది ఉండాలిట (3)
44) గొయ్యి (2)
46) సరిపడు (2)
47) పవిత్రజలం,అక్షరాలు అటూఇటూ (5)
49) పుష్పవిలాపము లాగే ఇదికూడా (6)
52) జాలి, అట్నుంచి(2)
53) బ్రహ్మపుత్రుడు,అక్షరాలు అటూ ఇటూ(4)
55) వ్యధ (2)
58) దీని రసం పులుపు (2)
59) జిహ్వా....అరికట్టే మంచిది (4)
61) ఐరాస లో ప్రసంగించిన ధీరబాలిక(3
63) దివిటీలు, అక్షరాలు అటూఇటూ(4)
65) నయనములలో (4)
67) ఒక పువ్వు (3)
68) దీంట్లో నీరు త్రాగటం ప్రశస్తమట(4)
70) బంధుత్వము (2)
71) దీంట్లో వేయించుకోవచ్చు (3)
72) యమున,అక్షరాలు అటూఇటూ (3)
75) వెదకు (2)
76) వ్యక్తి పౌరసత్వం తెలియజేసేది (4)
78) శేషము (3)
79) చెడు వాసన (2)
80) .. చిక్కిన (2)
82) గెలువబడినది (4)
83) పుష్టి (3)
84) పోస్టల్ వారు ఈమధ్యనే నిలిపివేసిన సేవ (3)
85) వినాయకుడు, అట్నుంచి (5)
87) కొత్త, అట్నుంచి (2)
88) పేజీ (2)
90) దబ్బపండు,అక్షరాలు అటూఇటూ(4)
92) రెండో తిథి (3)
93)పారవశ్యము,అక్షరాలు అటూఇటూ(3)
94) ఒప్పులు కావు(3)
95) ..కడలిపై శేషతల్ప ,అట్నుంచి (2)
96) వదనము (3)
97) రామచంద్రుని నామవిశేషణం(11)

## ఆధారాలు - నిలువు

1) భయం (3)
2) గద్గద స్వరం (4)
3) కోడలి తండ్రి (4)
4) చక్రంబు చేపట్టి చనుదెంచు ...అక్షరాలు అటూ ఇటూ(4)
5) మట్టి పాత్ర, అట్నుంచి (2)
6) క్షణం (2)
7) యోగా లో ఇది ఒక భాగం (5)
8) మోక్షం (2)
10) సీసము (2)
13) పడక (4)
14) పళ్ళు ఈలెక్కన అమ్ముతారు (3)
16) అన్నం ఇలాఉంటే బాగుంటుంది (3)
17) ఇవి ఉడకబెట్టి కూడా తింటారు (3)
18) ఆకాశంలో కనిపించేవి (4)
19) లేదు కాకపోతే (3)
20) యముడు వేసేది (3)
21) విష్ణువు, అట్నుంచి (3)
22) స్నేహముతో (4)
23) రాముడు మంచి ...,అట్నుంచి (3)
25) శ్రద్ధ (2)
27)వేసవిలో రామగుండం, అక్షరాలు అటూ ఇటూ(4)
29) ఈ అక్షరం కనుమరుగై పోతోందా(3)
31) వేడిది తాకితే చేయి...మంటుంది, అట్నుంచి (3)
34)పాతముఖ్యమంత్రిగారిఇంటిపేరు (2)
35) సౌందర్యవంతుడు (4)
36) గెలుపుతో,అట్నుంచి (3)
37) పరిమితి (3)
38) మాట ఇలాఉంటే కష్టం,అట్నుంచి (3)
39) రేపిస్టుల కోసం చేసిన చట్టం (3)
40) గంప, అట్నుంచి (2)
41) అమ్మలగన్నయమ్మ........(10)
43) సువాసన (4)
45) ఎకరంలో నలభైవ వంతు,అట్నుంచి (2)
48) పసితనము,అక్షరాలు అటూఇటూ(3)
50) డొంకంత ఎప్పుడు కదులుతుంది? (5)
51) రేయి కాదు (3)
54) ఒక కాలానికి సంబంధించిన (2)
56) శివుడి ఆనతిలేందే కుట్టనిది (2)
57) మనోవ్యధ (2)
58) నన్ను కాదు .. (2)
59) నాగలి గీత (2)
60) శ్రీవారికి రాత్రి చేసే సేవ (4)
62) వెస్టిండియన్ క్రికెటర్ (2)
63) దర్పము (2)
64) డా.శ్రీదేవి వ్రాసిన గొప్ప నవల (7)
65) రాసేవాడు (2)
66) తక్కువ (3)
69) పూబంతి (2)
70) కీలెరిగి పెట్టవలసింది (2)
73) అనుకోకుండా జరిగేది (6)
74) శిష్యతి కామపి ......రమయతి (6)
76) ఒక పువ్వు (2)
77) ఢిల్లీ దగ్గర నది (3)
78) ఆపు (3)
79) పుస్తక సంబంధ భాష, అక్షరాలు అటూ ఇటూ (3)
81) పార్శ్వము , అట్నుంచి (2)
82) జాలువారినది (5)
84) గిన్నెలో తిప్పేది, అట్నుంచి (3)
86) కోర్టు ....చేస్తే శిక్ష పడుతుంది (4)
89) నేర్పు, అక్షరాలు అటూఇటూ(3)
91) సముద్రము (3)
92) కుప్పం లోని యూనివర్సిటీ, అక్షరాలు అటూ ఇటూ(3)
95) చిన్న (2)


## జనవరి నెల గళ్ళనుడి కట్టు సమాధానాలు

| | | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ప | స | | కే | స | రి | | | పె | సు | లు | బా | టు | | మ | నో | జ | వ | ము |
| య | ద్వా | పం | త | ధృ | వ | తి | | గ | | కా | వు | | క | రి | | డె | | న |
| న | వ | | ము | క్తి | | న్న | మొ | టు | అ | | టా | టా | న | గ | రు | | క్క | బు |
| ము | న | తా | సం | | | ఇం | | | రి | పు | | | బ | | మ | దా | ల | స |
| | | బే | | ఎ | ర | టి | చె | ట్టు | | త్రి | యి | చ | ర | | | ప | | |
| కో | ర | లు | | స | | వా | రి | | కో | క | | కో | చు | | పా | ల | పుం | త |
| యి | | | | లు | కు | సా | | | ప | | | ర | | మి | త్ర | | | మ |
| ల | వం | గ | ము | | సా | లు | | ము | గిం | పు | | ము | ర | వా | | మ | గ | త |
| | కా | ని | | | టి | | క | | చు | | పై | | | భ | | ర | | మ |
| లో | యి | లో | | శ | కుం | త | ల | | | మీ | సా | ల | కు | సం | పెం | గ | నూ | నె |
| లా | | | పూ | ని | | | క | మ | లి | న | | వ | | | | డం | | ల |
| కు | | వి | చి | త్ర | ము | | ల | | | మే | లి | ము | సు | గు | | | | వు |
| | | లే | | యో | | | ము | క్క | | ష | | | ప్ర | వా | స | ము | | లు |
| పై | శా | ఖ | | ద | శ | మి | | ప | ట | ము | | మ | బా | | హా | | | త |
| భ | | రి | | శి | ని | | | టు | | లు | యి | తి | తం | | వా | | పి | ప్పి |
| వ | | | ద్దు | | | ర్వం | పూ | అ | | | మి | | | | సా | | చ్చి | న |
| ము | మ్మ | ర | ము | | లు | | ను | | | త | | పా | త | పా | ట | లు | | |
| | చె | వి | | నా | దు | | కొ | డ | వ | టి | గం | టి | | టో | | జ | టి | లం |
| | | క | న్నీ | రై | చిం | దె | ను | | | ని | ప | | కే | ళి | | ప్ర | పం | చం |


పద్మ విభూషణ్ శ్రీమతి వైజయంతిమాల


పద్మవిభూషణ్ శ్రీమతి పద్మ సుబ్రహ్మణ్యం

RNI No. TELTEL/2011/39497 FEBRUARY 2024 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st February Date of Posting:8th February







Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.